ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 24-07- 2026 సంపుటి: 17, సంచిక: 111, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



### యూనిఫాంల నాణ్యతపై

# రాజీ లేదు

## ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

**పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు**

**త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి పెంచాలి**

**యూనిఫాం సరఫరాపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జూలై 23 (ప్రజాకలం) :
ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అందించే యూనిఫాంల నాణ్యతలో రాజీ పడబోమని ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి స్పష్టం చేశారు. యూనిఫాంల పంపిణీ అనంతరం ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని సీఎం తెలిపారు. విద్యార్థులు ఇచ్చే అభిప్రాయాల ఆధారంగానే వచ్చే ఏడాది యూనిఫాంల రంగులు, డిజైన్, ఇతర అంశాల్లో మార్పులు చేయనున్నట్లు స్పష్టం చేశారు. యూనిఫాం పంపిణీపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో గురువారం నిర్వహించిన సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని తేల్చిచెప్పారు. ఆగ స్టు 15 నాటికి రాష్ట్రంలోని విద్యార్థులందరికీ యూనిఫాంలు అందించాలని, పంపిణీలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. యూనిఫాం తయారీ, సరఫరా ప్రక్రియను వేగవంతం చేసేందుకు మహిళా సంఘాలతో సమన్వయం పెంచాలని సెర్ప్ సీఈవో దివ్యకు సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా ముంద స్తు కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సు దర్శన్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గ్రే వాటర్ వినియోగానికి కొత్త నిబంధనలు**

భవిష్యత్‌లో పరిశ్రమలు, నిర్మాణ రంగంలో శుద్ధి చేసిన గ్రే వాటర్ వినియోగాన్ని ప్రోత్సహించేలా నిబంధ నలు రూపొందించి అమలు చేయాలని సీఎం సూచించారు. దీని ద్వారా రానున్న రోజుల్లో తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో ఎంఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

**క్యూర్ పరిధిలో ఏకీకృత తాగునీటి సరఫరా వ్యవస్థ**

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఏకీకృత తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మహానగరానికి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర తాగునీటి సరఫరా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు సరిపోయేలా ప్రణాళిక ఉండాలని సూచించారు. హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలో జరుగుతున్న పనులపై ఎంసీహెచ్‌ఆర్డీలో గురువారం రాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...

# కాంగ్రెస్‌దే లీకుల చరిత్ర

## టెన్త్ పేపర్ లీకైతే సీఎం రేవంత్ ఎందుకు తప్పుకోలేదు?

**రాహుల్, రేవంత్‌కు ప్రశ్నించే హక్కులేదు**

**'నీట్' ఘటనలో కేంద్రం 17 మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టింది**

**రెండోసారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాం**

**ఢిల్లీలో మీడియాతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, జూలై 23 (ప్రజాకలం) :
'కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు లెక్కకు మించి పరీక్ష పేపర్ల లీకేజీలు జరిగాయి. అప్పుడు రాజీనామా చేయని వ్యక్తులు.. ఇప్పుడు బీజేపీ మంత్రులను రాజీనామా చేయాలని అడుగుతున్నారు. లీకుల చరిత్ర మీదే' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీక్‌లపై, తమ మంత్రులను రాజీనామా చేయాలని ప్రశ్నించే నైతిక హక్కులు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. మీ హయాంలో ఎన్ని రకాల ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయో తెలుసుకోవాలని హితవు పలికారు. అప్పుడు ఎంతమంది మంత్రులు రాజీనామా చేశారో మీరు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలకు రాజకీయాలు, అధికారమే తప్ప విద్యార్థుల భవిష్యత్తు, దేశ భద్రత అవసరం లేదని, వారికి అధికారం రాకపోతే ఏ వ్యవస్థనైనా కూల్చేస్తామన్నట్టు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా పేపర్ లీక్ చేసిన వారికి కఠిన శిక్ష విధిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పినా రాజకీయ అస్థిత్వం కోసం కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు అరాచకం చేస్తున్నాయని, కాంగ్రెస్.. జాతీయ పార్టీ అనే విషయాన్ని మర్చిపోయి, దేశంలోని అన్ని వ్యవస్థలను కూ ల్చే ప్రయత్నం చేస్తున్నదని మండిప డ్డారు. విద్యార్థులను ఎగదోసి దేశ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ కేంద్రంగా, గత రెండు రోజులుగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని, ఈ ధర్నాలు రాజకీయ ప్రేరేపితంగా జరుగుతున్నాయని మండిపడ్డారు.

తరువాయి 2వ పేజీలో...

### సీఎంకు కేటీఆర్

# లీగల్ నోటీసులు

## 48 గంటల్లో రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- నా ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- గ్లోబరీనా టెక్నాలజీస్‌తో నాకు సంబంధం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 23 (ప్రజాకలం) :
గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థ వ్యవహారంలో తనపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అసత్య ఆరోపణలను ఉపసంహరించుకుని, 48 గంటల్లో భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రేవంత్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

### యూపీఏలో

# 53 లీక్‌లు!

## కాంగ్రెస్‌కు పరీక్షల గురించి మాట్లాడే హక్కు లేదు

**దేశంలో అలజడులు సృష్టించేదుకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల కుట్ర**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



హైదరాబాద్, జూలై 23 (ప్రజాకలం) :
'కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాం గ్రెస్ నాయకులు తమ గత చరిత్రను గుర్తుచేసుకోవాలి. 2014కు ముందు యూపీఏ ప్రభు త్వ హయాంలోనూ, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు (టీఎంసీ, డీఎంకే, ఎస్పీ,బీఆర్ఎస్ ) పాలించిన రాష్ట్రాల్లో 53 కంటే ఎక్కువ ప్రధాన పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. ఆ సమయం లో కాంగ్రెస్ లేదా బీజేపీయేతర ప్రభుత్వాల విద్యాశాఖ మంత్రులు రాజీనామాలు చేశారా?' అని బీజేపీ రాంచందర్‌రావు ప్రశ్నించారు.

తరువాయి 2వ పేజీలో...



### చేయని పనులు చేసినట్లు

# బిల్లుల చిత్రీకరణ

**వెల్గటూర్ లో అభివృద్ధి నిధులను దోచుకుంటున్న కార్యదర్శులు..**

**కార్యదర్శులకు మద్దతి స్తున్న మండల అధికారులు**

**చేసేది ఏమిలేక చెప్పినట్లు బిల్లులు చెల్లిస్తున్న సర్పంచులు**

వెల్గటూర్, జులై 23, ప్రజాక లం ప్రతినిధి :
గ్రామాలల్లో అధికారుల పాలనాకాలం కార్యదర్శుల పాలిట వరంగా మారింది. గ్రామంలో చేయని అభివృద్ధి పనులను చేసినట్లుగా చిత్రీకరిస్తు కొందరు పంచాయతీ కార్యదర్శులు లక్షలల్లో బిల్లులు సృష్టించి

తరువాయి 2వ పేజీలో...

### ప్రజలకు సత్వర న్యాయం

4

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

## కలం కౌంటర్




### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు

# ప్రతిపక్షం పట్టు

**నాలుగో రోజు స్తంభించిన పార్లమెంట్ – చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, జూలై 23 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నాలుగో రోజు కూడా ప్రతిష్ఠంభన కొనసాగింది. నీట్ ప్రశ్న పత్రం లీక్ వ్యవహారం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగడంతో గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దిగి నినాదాలు చేయడంతో ఉభయ సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. చివరకు రోజంతా ఎలాంటి ముఖ్యమైన కార్యక్రమాలు జరగకుండానే ముగిశాయి.
**ఏం జరిగింది?...** ఉదయం దిలీప్ సైకియా అధ్యక్షతన సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష ఎంపీలు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అయితే, చర్చకు ముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు. మంత్రి రాజీనామా చేసిన తర్వాతే చర్చలో పాల్గొంటామని స్పష్టం చేశారు. ఈ అంశంపై రాజ్యసభలో రూల్–267 కింద చర్చ చేపట్టాలని కూడా ప్రతిపక్షం కోరింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాల వైఖరిని తప్పుబట్టారు. నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం



సిద్ధంగా ఉందని, చర్చ జరిగే తేదీ, సమయం, వ్యవధిని కూడా ప్రతిపక్షమే నిర్ణయించుకోవచ్చని ప్రకటించారు. అయినప్పటికీ ముందస్తు షరతులు విధిస్తూ చర్చ నుంచి తప్పించుకునేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్.. సభ్యులను శాంతించాలని, చర్చకు అవకాశం కల్పించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది.

తరువాయి 2వ పేజీలో...

### తెలంగాణ గుండెచప్పుడు

# సింగరేణి



## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**- సింగరేణితో తెలంగాణ ప్రజలది భావోద్వేగ బంధం**

**- ప్రైవేటు పోటీని తట్టుకునేలా ఉత్పత్తి వ్యయం తగ్గించాలి**

**- సత్తుపల్లి ఓసి లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయి పరిశీలన**

ఖమ్మం జూలై 23( ప్రజాకలం న్యూస్)
పోటీ ప్రపంచంలో సింగరేణి క్యాలరీస్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణ ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి తెలంగాణకు ఆత్మలాంటిది.. కార్మికులు, ప్రజలతో 130 ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణితో భావోద్వేగ అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు లాభదాయకంగా అందించడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. గురువారం సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ బొగ్గుగనిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. గనిలో బొగ్గు లభ్యత, పరిమాణం, బొగ్గు క్వాలిటీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటుగా ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్,

తరువాయి 2వ పేజీలో...

# యూనిఫాంల నాణ్యతపై రాజీ లేదు

మొదటి పేజీ తరువాయి...

ఎల్ నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రధాన నీటి వనరులను అనుసంధానం చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ వడు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతున్న పరిస్థితిపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇకపై ఇలాంటి పరిస్థితి కొనసాగకూడదని, ఆయా ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి సరఫరా ప్రాజెక్టులను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. తాగునీటి సరఫరా పనులు, ఎస్టీపీల నిర్మాణ పురోగతిపై ప్రతి నెలా తనకు నివేదిక సమర్పించాలని , ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**గ్లోబరీనా కేటీఆర్ బినామీనే!**

గ్లోబరీనా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధించిన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గ్లోబరీనాపై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విచారణలో వాస్తవాలు బయటపడతాయని సీఎం స్పష్టం చేశారు. గతంలో ఇంటర్ మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల కారణంగా 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. గ్లోబరీనా పేరు మార్చుకుని ఇతర పరీక్షల కాంట్రాక్టులు పొందిందని, వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందని, ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబరీనా విషయంలో చోటు చేసుకున్న తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. 'పరువు ఉన్నవాడే పరువు నష్టం దావా వేస్తాడు. కేటీఆర్ ఫిర్యాదు చేస్తే జన్వాడ భూములు ఏ రాజుల నుంచి వచ్చాయో బయటకి తెస్తా. విచారణలో గ్లోబరీనా ఏ రాజులదో బయటకి తెస్తాను' అని సీఎం పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ చిట్‌చాట్ నిర్వహించారు. 'గ్లోబరీనాపై విచారణ చేస్తే కక్ష సాధింపు అంటున్నారు. కేటీఆర్ ఒక్క ఫిర్యాదు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. నివేదిక వచ్చిన తర్వాత ఏది చేయాలో అది చేస్తాం. నచ్చితే నజరానా నచ్చకపోతే జరిమానా.. నా విధానం కాదు. చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. బీఆర్ఎస్ తప్పులపై విచారణ జరుగుతోంది. నాకు నచ్చలేదని వెంటనే శిక్ష వేయాలా? ' అని సీఎం పేర్కొన్నారు. కొన్ని కేసుల్లో శిక్షలను కోర్టులు అవుతున్నాయన్నారు. నీట్ పేపర్ లీక్ విషయంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని, బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇందిరాపార్కు వద్ద తాము తెరిచిన ధర్నా చౌక్ లోనే కేటీఆర్ ధర్నా చేస్తున్నాడని, శాంతియుతంగా నిరసనలు చేస్తే పర్మిషన్ ఇస్తామని తెలిపారు. ప్రధాని మోదీ అనుమతి ఇవ్వడం వల్లే బీఆర్ఎస్ ధర్నా చేస్తుందన్నారు. కేటీఆర్ బర్త్ డేపై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ తన పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలని, అయితే కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమోనని, ఆయనవి అన్ని వేరే పార్టీలుంటాయని సీఎం వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకుల మధ్య అంతర్గత కొట్లాటలు ఉన్నాయన్నాని, ఒకరంటే ఒకరికి పడదన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు ఇచ్చే ఇళ్లను దళారులకు అమ్ముకున్నారని సీఎం మండిపడ్డారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తుంటే .. పేదలకు లాభం జరుగుతుందనే అక్కసుతో బీఆర్ఎస్ మాట్లాడుతుంతోందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని, తాము ఏం చేస్తున్నామో అదే చెబుతున్నామని పేర్కొన్నారు. సర్ ప్రకియ వల్ల గ్రామాల్లో దళితులు, గిరిజనులు, అమాయకుల ఓట్లు పోయే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఓటు పోతే సంక్షేమ పథకాలు, ఆధార్‌కార్డు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితా సమగ్ర సరవణ 70 శాతం పూర్తయిందని, మిగిలిన 30 శాతం కీలకమని, అందుకు బీఎల్‌ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

# చేయని పనులు చేసినట్లు బిల్లుల చిత్రీకరణ

మొదటి పేజీ తరువాయి...

గ్రామపంచాయతీ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. గ్రామ కార్యదర్శులకు మండల స్థాయి అధికారుల మద్దతు లభించడంతో, సర్పంచులు చేసేది ఏమి లేక అడిగినన్ని డబ్బులు వారికి అందజేస్తున్నారు. మూడు పువ్వులు, ఆరు కాయలుగా పంచాయతీ కార్యదర్శులు సాగిస్తున్న ఆగడాల పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచులకు గతంలో ఉన్న సర్పంచ్ లకు మధ్య రెండు సంవత్సరాల పాటు పంచాయతి కార్యదర్శులు గ్రామపంచాయతీ పరిపాలన బాధ్యతలను నిర్వహించిన విషయం అందరికి తెలిసినదే. ఆ సమయంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో అభివృద్ధి పనులు (వీదులల్లో మట్టి పోసి చదును చేయించడం వీధి దీపాలు ఏర్పాటు చేయడం, చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం, డ్రైనేజీలలో పూడికలు తీయించడం) చేయించామంటూ కాగితాల పై ఖర్చులకు సంబంధించిన కాకి లెక్కలు చూపిస్తున్నారు. అక్కడ ఎటువంటి తీర్మానాలు చేయకుండానే లక్షలల్లో పనులు చేసినట్లు నమ్మిస్తున్నారు. బయట లభించే బిల్లులను తీసుకు వచ్చి ఇవే మా బిల్లులంటూ అందరిని నమ్మిస్తున్నారు. ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన సర్పంచ్ లు చాలా మంది కార్యదర్శులను నిలదీస్తే తమకు పాలనలో సహకరించరనే భయంతో వారు చెప్పినట్లే బిల్లులను చెల్లిస్తున్నారు. కొందరు ఎంతో కొంత సెటిల్మెంట్ చేసుకొని గ్రామపంచాయతీ అభివృద్ధి నిధులను కాజేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి నిజాయితీగా ఉండే సర్పంచులకు మద్దతుగా నిలుస్తూ గ్రామపంచాయతీ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. రికార్డుల తరలింపు: మండలంలోని కిషన్రావుపేట గ్రామంలో గతంలో పని చేసిన కృష్ణారెడ్డి అనే పంచాయతీ కార్యదర్శి తనకు 6 లక్షల 80 వేలు వస్తాయని ఏకంగా గ్రామ పంచాయతీ రికార్డులను ఇంటికి తీసుకువెళ్లాడు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆరు నెలలుగా రికార్డులు లేకపోయినా అతని పై అధికారుల చర్యలు మాత్రం శూన్యం.

# సీఎంకు కేటీఆర్ లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు, యాజమాన్య హక్కులు లేదా ఇతర అనుబంధాలు లేవని కేటీఆర్ స్పష్టంచేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మీడియా వేదికగా అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. గ్లోబరినా సంస్థ తన బినామీ కంపెనీ అని, ఆ సంస్థకు సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతోనే చేసినవని విమర్శించారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం తన పరువుకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి చేసే అసభ్యకరమైన, నిరాధారమైన ఆరోపణలకు తాను చాలా సందర్భాల్లో స్పందించలేదని, అవి అంతగా విలువలేనివని భావించానని పేర్కొన్నారు. తన మౌనాన్ని బలహీనతగా లేదా ఆరోపణలను అంగీకరించినట్లుగా భావించవద్దని స్పష్టం చేశారు. బురద రాజకీయాల్లో దిగడానికి తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు. 48 గంటల్లోగా భేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పి ఆరోపణలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలతోపాటు పరువు నష్టం దాఖలు చేస్తామని హెచ్చరించారు. గురువారం ఉదయం హన్మకొండలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడారు. గ్లోబరినా సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆ సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒకవైపు ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, మరోవైపు అది తన బినామీ సంస్థ అని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఒక మూట, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నది రేవంత్‌రెడ్డి పాలన అని మండిపడ్డారు. తాను సీఐడీ విచారణకు సిద్ధమని, అలాగే రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి ఆరోపణలపై సిట్ లేదా సీఐడీ విచారణకు ముఖ్యమంత్రి సిద్ధమేనా అని ప్రశ్నించారు. అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకు కూడా తాను సిద్ధమేనని, ముఖ్యమంత్రి కూడా అందుకు రావాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. పాత కేసుల భయం, అమృత్ పథకం తదితర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

# కాంగ్రెస్‌దే లీకుల చరిత్ర

మొదటి పేజీ తరువాయి...

విద్యార్థుల ను అడ్డుగా పెట్టుకుని, దేశ వ్యతిరేక శక్తులు ఇలా దాడులకు కారణం అవుతున్నారని, షహీన్‌బాగ్‌లో జరిగిన ఘటనల మాదిరిగానే విద్యార్థుల ను అడ్డుగా పెట్టుకుని కొందరు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ అయినప్పుడు వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, 17 మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టిందని, మిలటరీ విమానాల ద్వారా పేపర్లను తరలించి.. రెండోసారి సమర్థవంతంగా నీట్ పరీక్ష నిర్వహించారని గుర్తు చేశారు. ఏ పేపర్ లీక్ అయినా కూ డా రాసిన విద్యార్థులు, అభ్యర్థులు, తల్లిదండ్రులు బాధ పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ అయితే కఠిన చర్యలు తీసుకునేలా చట్టం తీసుకొచ్చామన్నారు. పబ్లిక్ ఎగ్జామినేషన్ యాక్ట్ ద్వారా పేపర్ లీక్ బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా సవరణలు తీసుకొచ్చామని, పరీక్ష పత్రా లు లీక్ కాకుండా చూడాలని బాధ్యతగా సలహాలు ఇవ్వాల్సిన కాంగ్రెస్ పార్టీ.. ప్రస్తుతం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందన్నారు. పేపర్ లీకేజీ బాధ్యులైన 17 మంది నిందితులను సీబీఐ అరెస్టు చేసిందని, పేపర్ లీకేజీ విషయంలో జీరో టోలరెన్స్ పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. దీనికి రాష్ట్రాలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, మమతా బెనర్జీ సీఎంగా ఉన్నప్పుడు పశ్చిమబంగాల్‌లో పేపర్లు లీకయ్యాయని, వారి హయాంలో ఒకలా.. బీజేపీ హయాంలో ఒకలా మీరు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వీరు ధర్నాలు చేస్తారనే ఆలోచనతో కాకుండా.. విద్యార్థులకు నష్టం జరగకుండా.. వారి భవిష్యత్తు నాశ నం కావొద్దనే ఉద్దేశంతో పకడ్బందీగా రెండోసారి నీట్ పరీక్ష నిర్వహించామని తెలిపారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.

**రేవంత్‌రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు**

2025లో పదో తరగతి పరీక్ష పత్రం లీక్ అయినప్పు?డు విద్యాశాఖ మంత్రిగా రేవంత్‌రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని రాంచందర్‌రావు ప్రశ్నించారు. టీచర్లను సస్పెండ్ చేశారు.. కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై సమాధానం చెప్పిన తర్వాతే రేవంత్‌రెడ్డి నీట్ పేపర్ గురించి ప్రస్తావించాలన్నారు. 2026 లో జయశంకర్ వ్యవసాయ వర్సిటీ, జగిత్యాలలో బీఎస్సీ పేపర్ లీక్ అయిందని, అప్పుడు మీ కాంగ్రెస్ మంత్రులతో రాజీనామా చేయించారా? అని నిలదీశారు. కాంగ్రెస్‌ది లీకుల చరిత్ర అని, విద్యార్థులపై కాంగ్రెస్‌కు ప్రేమ లేదన్నారు. తమిళనాడులో, కేరళ, ఢిల్లీలో షీలా దీక్షిత్ హయాంలో, రాజస్థాన్‌లో సచిల్ పైలట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా పాదయాత్ర చేశారని, రాజస్థాన్‌లో అశోక్‌గెహ్లాట్ హయాంలో 18 పేపర్లు లీక్ అయ్యాయని గుర్తు చేశారు. అప్పుడు ప్రియాంక గాంధీ ఎందుకు మాట్లాడలేదన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో 12వ తరగతి ఇంగ్లిష్, జార్ఖండ్ లో, డీఎంకే హయాంలో తమిళనాడులో, పశ్చిమ బెంగాల్‌లో టీచర్ పేపర్ లీక్ అయిందన్నారు. కేజ్రీవాల్ పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, కానీ పంజాబ్‌లో కూడా పేపర్లు లీక్ అయ్యాయని విమర్శించారు. మరి అక్కడికి వెళ్లి.. ఎందు కు ధర్నాలు చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు మీరు ఎక్కడ పోయారని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎలాంటి మార్పులు కావాలన్నా.. సంస్కరణలు తీసుకురావాలన్నా మేం అంగీకరిస్తామని స్పష్టం చేశారు. చర్చలకు వచ్చి.. సలహాలు ఇవ్వాలని సభలో అడగాలి.. కానీ చర్చకు రాకుండా సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సభ లో ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించాల్సింది పోయి లేనిపోని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లు ఎన్నిసార్లు లీక్ అయ్యాయనో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీచ్‌లో చెడ్డీలు వేసుకునే వారు కూడా ప్రశ్నించడం సిగ్గుచేటు**

తుక్డే గ్యాంగులు.. భారత్‌ను ముక్కలు చేయాలని, నిర్వీర్యం చేయాలని ఆలోచించే వాళ్లంతా.. జంతర్ మంతర్ వద్దకు చేరి ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో పెట్టుబడులు తీసుకొస్తున్నామని, దేశ గౌరవాన్ని పెంపొందిస్తున్నామని, ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నామని చెప్పారు. బీచుల్లో చెడ్డీలు వేసుకుని తిరిగే మీరు ఇవాళ రాజీనామా చేయాలని ప్రశ్నించడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. దేశ వ్యతిరేక శక్తులు ఏకమై దేశ ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. 2023లో తెలంగాణలో ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అసలు అమలు చేశారా?, 2024 లోపల 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి.. ఇవేవీ అమలు చేయకుండా మా గురించి ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. అశోక్ నగర్ లైబ్రరీ అడ్రస్ ఇప్పుడు రాహుల్ గాంధీకి, రేవంత్ రెడ్డికి గుర్తుం దా?, మా హామీలు అమలు చేయలేకపోయామని తెలంగాణ నిరుద్యోగులకు క్షమాపణ చె ప్పారా? అని నిలదీశారు.

# యూపీఏలో 53 లీక్‌లు!

మొదటి పేజీ తరువాయి...

2005 నుంచి 2014 వరకు సీబీఎస్ఈ, ఎయిమ్స్, ఆర్ఆర్ బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ వంటి అనేక జాతీయ స్థాయి పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని రాంచందర్‌రావు ఆధారాలతో వివరించారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచా రాన్ని ఆయన గణాంకాలతో తిప్పికొట్టారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పరీక్ష పేపర్ లీక్ అయితే నిందితులపై 420 కేసులు నమోదు చేసి వదిలేసేవారని, మోదీ ప్రభుత్వం 2024లో ప్రివెన్షన్ ఆఫ్ అన్-ఫెయిర్ మీన్స్ ఇన్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ తీసుకువచ్చిందన్నారు. దోషులకు కోటి రూపాయల జరిమానాతో పాటు కఠిన శిక్షలు పడేలా చట్టాన్ని రూపొందించిందన్నారు. అలాగే ప్రొఫెసర్ రాధాకృష్ణన్ నేతృత్వంలో 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ని బలోపేతం చేసి సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. నీట్ ఎగ్జా మినేషన్ పేపర్ లీకేజీ విషయం తెలిసిన వెంట నే ఎన్డీయే ప్రభుత్వం తక్షణమే 31 మందిని అరెస్ట్ చేసిందని రాంచంరద్‌రావు వెల్లడించారు. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ అనుకూల వ్యక్తులే ప్రశ్న పత్రం లీకేజీకి కారణమని తేలిందన్నారు. విద్యార్థులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం రీ-ఎగ్జామ్స్ నిర్వహించిందని, ఏ ఒక్క విద్యార్థి కూడా దీనిపై రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలపలేదని పేర్కొన్నారు.

**అశాంతిని సృష్టించే కుట్ర**

దేశంలో అశాంతిని సృష్టించి, యువతను రెచ్చగొట్టడం ద్వారా ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్, వామపక్షాలు, విదేశీ విచ్ఛిన్నకర శక్తులు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతున్నాయని రాంచందర్‌రావు మండిపడ్డారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో భారతదేశంలో కూడా అశాంతిని, హింసను సృష్టించేందుకు కొన్ని అల్ట్రా-లెఫ్ట్, సాఫ్ట్-లెఫ్ట్ శక్తులు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఎస్ఏ వంటి పాత సంఘాల నాయకులు కొత్త పేర్లతో కాక్రో జనతా పార్టీ వంటి వేదికలను ఏర్పాటు చేస్తున్నారని ఆయ న ఆరోపించారు. పుణే, ముంబై, హైదరాబాద్, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన కార్యక్రమాల వెనుక ఈ దేశ వ్యతిరేక శక్తుల హస్తం ఉందన్నారు. ఈ ఉద్యమాలకు ఖలిస్తాన్ శక్తుల నుంచి రూ. 10 కోట్లు, కతార్, కెన డా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి ఆర్థిక, వ్యూహాత్మక మద్దతు అందుతోందని, అందు కు సంబంధించిన ఆధారాలతో సహా సంచలన విషయాలు బయటపెట్టారు. ఏ ఖలిస్తానీ శక్తులైతే రాహుల్‌గాంధీ నానమ్మ ఇందిరాగాంధీని పొట్టనబెట్టుకున్నాయో, అదే శక్తులతో రా హుల్‌గాంధీ జతకట్టడం సిగ్గుచేటని విమర్శించారు.

**ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో రికార్డ్**

2004-2014 మధ్య యూపీఏ ప్రభు త్వం కేవలం 2.9 కోట్ల ఉద్యోగాలు మాత్రమే సృష్టిస్తే, 2014- 2024 మధ్య మోదీ ప్రభుత్వం 17 కోట్ల ఉద్యోగ అవకాశాలను సృష్టించిందని రాంచందర్‌రావు తెలిపారు. ఎన్డీయే పాలనలో ఇప్పటివరకు 12 లక్షలకు పైగా నియామక పత్రాలు అందజేశామని, 19 రోజ్‌గార్ మేళాల ద్వారా నిరంతరం నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. 2017-18లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1 శాతానికి తగ్గిందని, ఎంప్లాయ్‌మెంట్ రేటు 46.8 శాతం నుండి 57.4 శాతానికి పెరిగిందని ఆయన వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో ఐఐటీ, ఐఐఎమ్, ఎయిమ్స్, ఎన్ఐటీ, మెడికల్ కళాశాలల సం ఖ్యను రెట్టింపు చేశామని, ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు 4.5 కోట్లకు పైగా పెరిగిందని వివరించారు. వికసిత్ భారత్, ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా ద్వారా కోట్లాది మంది యువతకు స్వయం ఉపాధి లభించిందన్నారు.

**తెలంగాణ యువత దేశానికే కొండంత అండ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశ వ్యతిరేక శక్తులకు, విదేశీ నిధులతో నడిచే సంఘాలకు మద్దతు ఇవ్వడం మానుకోవాలని రాంచందర్‌రావు హెచ్చరించారు. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో జరిగిన పరిణామాలను ఇక్కడ పునరావృతం చేయాలని చూస్తే భారతీయ యువత చూస్తూ ఊరు కోదని, వారంతా దేశభక్తితో ప్రధాని మోదీ న వభారత నిర్మాణంలో భాగస్వాములవుతారని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ యువత దేశానికి కొండంత అండగా ఉంటుందన్నారు.

# తెలంగాణ గుండెచప్పుడు సింగరేణి

మొదటి పేజీ తరువాయి...

సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్ కో సీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడుతూ మైనింగ్ నిర్వహణలో పాటిస్తున్న పద్ధతులు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యక్షంగా చూడటానికే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ అనేది మైనింగ్ లో బయటకు తీసే మట్టి, రాతి వ్యర్థం. బొగ్గు (జష్మిశ్రీ) అనేది సింగరేణికి ప్రధాన రాబడి తెచ్చే అత్యంత విలువైన వనరుగా ఆయన అన్నారు. కాంట్రాక్టర్లకు ఓబి తీసినా, బొగ్గు తీసినా వాల్యూమ్ ప్రకారమే బిల్లులు వస్తాయి కాబట్టి వారి దృష్టిలో రెండూ ఒక్కటే అనిపించవచ్చని, సింగరేణి యాజమాన్యానికి మాత్రం ఓవర్ బర్డెన్, బొగ్గు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా స్పష్టంగా తెలిసి ఉండాలన్నారు. ఫేస్ వద్ద బ్లాస్టింగ్ జరిపి, లోడింగ్ చేసే సమయంలో బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్ళు కలవకుండా చూడాలన్నారు. ప్రతీ షావల్ దగ్గర, ప్రతీ లోడింగ్ పాయింట్ దగ్గర మన అధికారులు ఉండి కంటిన్యూయస్ మానిటరింగ్ చేయాలన్నారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ పవర్ ప్లాంట్లలో ప్రొడక్షన్ తగ్గిపోయి ట్రిప్ అవుతాయని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన బొగ్గును మాత్రమే జెన్ కోకు ఇతర కస్టమర్లకు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఒకప్పుడు బొగ్గు రంగంలో ఏకఛత్రాధిపత్యం ఉండేదని, ఈ రోజు పరిస్థితి మారిందని అన్నారు. మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలు పోటీకి వస్తున్నాయని, విదేశాల నుంచి 'ఇంపోర్టెడ్ కోల్' వస్తోందన్నారు. ఈ కాంపిటీటివ్ మార్కెట్ లో సింగరేణి నిలబడాలంటే అత్యంత నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం ముఖ్యమని తెలిపారు. గత పదేళ్ల కాలంలో కొత్త కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల చాలా అవకాశాలను కోల్పోయామని డిప్యూటీ సీఎం అన్నారు. ఒక కోల్ బ్లాక్ వేలంలో దక్కించుకుని, అక్కడ భూసేకరణ, అటవీ అనుమతులు సాధించి మైనింగ్ ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్ల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కనీసం 10 ఏళ్ల ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అన్నారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరుగుతుంది? దానికి ఎంత బొగ్గు అవసరం? అనేదానిపై సింగరేణి యాజమాన్యం - జెన్ కో యాజమాన్యం కలిసి కూర్చుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల-2, నైని వంటి బ్లాక్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఫారెస్ట్ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని అన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగే నూతన కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ప్రపంచం మొత్తం ఈ రోజు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది. సింగరేణి కూడా కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్ ఎనర్జీ రంగంలోకి వేగంగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్తులో థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వాడకం పెరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా సింగరేణి సోలార్ పవర్ ఉత్పత్తిపై మరింత దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మైనింగ్ రంగంలో సింగరేణి సంస్థకున్న అపారమైన అనుభవం, నిపుణులైన సాంకేతిక శక్తి కేవలం బొగ్గుకే పరిమితం కాకూడదన్నారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణిని కాపాడుకుంటూ, లాభాల బాట పట్టిస్తూ, ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సింగరేణి ప్రభను మరింతగా వెలిగించాలని డిప్యూటీ సీఎం అన్నారు. అనంతరం కిష్టారం లో నిర్మించిన క్వార్టర్ల ను డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సింగరేణి డైరెక్టర్లు ఎల్. వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, యం. తిరుమల రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు**

# ప్రతిపక్షం పట్టు

మొదటి పేజీ తరువాయి...

దీంతో ఉభయ సభలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ప్రశ్నోత్తరాల సమయం, ప్రభుత్వ బిల్లులపై చర్చలు, ఇతర శాసన కార్యక్రమాలు కూడా అంతరాయానికి గురవడంతో రాజ్యసభను 3 గంటల వరకు వాయిదా వేశారు. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పందించారు. యువతకు సంబంధించిన కీలక అంశాన్ని ప్రతిపక్షం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుందని విమర్శించారు. ప్రతిపక్షం, రాహుల్‌గాంధీ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని బీజేపీ ఎంపీలు మనోజ్ తివారీ, సంబిత్ పాత్ర విమర్శించారు. 'పార్లమెంటులో నీట్ గురించి చర్చించండి. ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు' అని వారు గుర్తు చేశారు.

**ఎన్డీఏ ఎంపీల ఆందోళన**

నీట్ ప్రశ్న పత్రం లీక్ వ్యవహారం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, సీజేపీ కార్యకర్తల ర్యాలీ సందర్భంగా పోలీసులు క్రూరంగా వ్యవహరించిన తీరుపై పార్లమెంట్‌లో చర్చించాలని ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళనకు దిగారు. నిరసనలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సమాజ్‌శాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇండి కూటమి నిరసనకు ప్రతిగా ఎన్డీఏ ఎంపీలు కూడా ఆందోళన నిర్వహించారు. ఇదే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**సమస్యను రాజకీయాలకు వాడుకోవద్దు : జేపీ నడ్డా**

నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిద్ధంగా ఉందని రాజ్యసభ్యుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అన్ని పార్టీలతో కలిసి విధానపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతిపక్షం రాజకీయ ఆరోపణలు చేయకుండా చర్చలో పాల్గొనాలని కోరారు. పేపర్ లీక్‌లు ఒకే రాష్ట్రానికి లేదా ఒకే పార్టీకి సంబంధించిన సమస్య కాదని, ఇది దేశవ్యాప్త సమస్య అని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ చేసిన విమర్శలకు స్పందిస్తూ, సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవడం కంటే పార్లమెంట్‌లో చర్చ జరిపి పరిష్కారం కనుగొనాలన్నారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో, ప్రభుత్వం మరింత చర్చలకు కూడా సిద్ధంగా ఉందని, అవసరమైతే తన కార్యాలయంలో గానీ నివాసంలో గానీ సమావేశం కావచ్చని నడ్డా సూచించారు.

## ఓటరు జాబితా సవరణను ప్రతి కుటుంబం
# తప్పనిసరిగా పూర్తి చేయాలి
### - ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 23 (ప్రజా కలం) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం మెట్‌పల్లిలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వయంగా నింపి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హులైన ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటికి వచ్చే బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) అవసరమైన పత్రాలు, వివరాలు అందించి ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని కోరారు. అలాగే ఓటరు జాబితాలో పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఒకసారి పరిశీలించి, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ బీఎల్‌వోలతో వరప్రసాద్ కీలక సమావేశం
### - ఓటరు నమోదు, రీ వెరిఫికేషన్‌పై విస్తృతంగా చర్చ..
### - గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపు



రుద్రంగి, జూలై 13, (ప్రజాకలం ప్రతినిధి) రుద్రంగి మండలం మానాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతం, ఓటరు నమోదు ప్రక్రియ, బీఎల్‌వోల బాధ్యతలపై విస్తృతంగా మాట్లాడారు. గ్రామంలో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య, ఇప్పటివరకు డిజిటల్ చేసిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిగలకుండా ఇంటింటికీ వెళ్లి రీ వెరిఫికేషన్ నిర్వహించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని, గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా జనరల్ సెక్రటరీ తుమ్ జలపతి, ఉప సర్పంచ్ దాసరి అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి,కమ్మర్పల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, దేవేందర్, రూప్ల తండా సర్పంచ్ జవహర్ లాల్ నాయక్, తిక్క భూమయ్య, మదన్ నాయక్, తిరుపతి నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు
# నాణ్యత తో పూర్తి చేయాలి
### - నేరెళ్లలో నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి జూలై 23 (ప్రజాకలం) ధర్మపురి నియోజకవర్గంలోని నేరెళ్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, భవనాల రూపకల్పన, తరగతి గదులు, వసతి గృహాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటును సంబంధిత అధికారులతో సమీక్షించారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు అత్యుత్తమ వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు.నిర్మాణ ప్రాంతంలో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్లాన్ మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాధికారి కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
### అపాయింటెడ్ డే వెంటనే ప్రకటించాలి - మాజీ మంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి జూలై 23 (ప్రజాకలం) ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. దశాబ్దాల పాటు సంస్థ అభివృద్ధికి సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందాల్సిన పీఆర్సీ, డీఏ, పెన్షన్ తదితర ప్రయోజనాలు అందకపోవడం విచారకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు శాసనసభ, శాసన మండలి ఆమోదం లభించడంతో పాటు గవర్నర్ కూడా ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. అయితే ఎన్నికల కారణంగా అపాయింటెడ్ డే ప్రకటించలేకపోయారని చెప్పారు. ఆ రోజు ప్రకటించి ఉంటే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, పెన్షన్, ఇతర సేవా ప్రయోజనాలు లభించేవని అన్నారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేపట్టగా త్వరలో అపాయింటెడ్ డే ప్రకటిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి సమ్మెను విరమింపజేసిందని, ఇప్పుడు మాత్రం యూనియన్ ఎన్నికల తర్వాతే అపాయింటెడ్ డే ప్రకటిస్తామని చెప్పడం సరైన విధానం కాదని విమర్శించారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది వృద్ధులేనని, వారికి తగిన పెన్షన్, ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే అపాయింటెడ్ డే ప్రకటించి ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా ఉంటానని, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆగస్టు 4న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, తాను కూడా పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

# ప్రత్యేక ఓటరు సవరణను పకడ్బందీగా నిర్వహించాలి
### - ధర్మపురిలో ఇంటింటి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి జూలై 23 (ప్రజాకలం) భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.గురువారం ధర్మపురి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు, 33 పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించి, ప్రజలు నింపిన ఫారాలను ఆగస్టు 3లోపు సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా అందజేయాలని కోరారు.ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్‌వోలు లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొంతమంది ఓటర్లు ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, ఇతర ప్రాంతాలకు మారారని లేదా వేరే ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్‌వోల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు సంబంధిత ఫారంలో తమ ప్రస్తుత వివరాలను పూర్తిగా నమోదు చేయాలని సూచించారు.వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో నమోదు చేయడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రతి అర్హ ఓటరు ఆగస్టు 3లోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్‌వోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్రాగునీటికి ఎలాంటి అంతరాయం కలగవద్దు
### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,జూలై 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో త్రాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.జిల్లాలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,అవసరమైన చోట ప్రత్యామ్నాయ త్రాగునీటి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో త్రాగునీటి సరఫరాకు సంబంధించి చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.గ్రామాలు, పట్టణాల్లో త్రాగు నీటి సరఫరా మరింత సజావుగా జరిగేందుకు అవసరమైన అదనపు పనులు ఏవైనా ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు.జిల్లాలోని అన్ని బోర్‌వెల్,చేతి పంపుల వద్ద వర్షపు నీటి సంరక్షణకు ఉపయోగపడే రీఛార్జ్ గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేసి,సెప్టెంబర్ నెలాఖరు నాటికి 100 శాతం పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాల పెరుగుదలకు ఈ చర్యలు ఎంతో ఉపయోగపడతాయని, పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.మిషన్ భగీరథ గ్రిడ్‌కు సంబంధించిన పెండింగ్ పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేసి పూర్తి స్థాయిలో త్రాగునీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈ.ఈ.పూర్ణచందర్,మిషన్ భగీరథ ఇంట్రా ఎస్ఈ గంగాధర శ్రీనివాస్,డీఈలు ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు
### -నూతన ఎస్సీ కళాశాల వసతి గృహాలు ప్రారంభం



పెద్దపల్లి,జూలై 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లా కేంద్రంలో ఎస్సీ విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఎస్సీ కళాశాల వసతి గృహాలను ప్రారంభించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్ పేర్కొన్నారు.ఇందులో భాగంగా ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహాన్ని పాత భవనం నుండి రంగంపల్లి కోర్టు సమీపంలోని ప్రైవేట్ భవనానికి మార్చగా,ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.రవీందర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ,ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థిని,విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రావణ్ కుమార్, మంథని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వెంకటస్వామి,వసతి గృహ సంక్షేమ అధికారులు సంతోష్,శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు
## భాగస్వామ్యం కావాలి - రుద్రంగి ఎస్సై మోతీరాం



రుద్రంగి, జూలై 23, (ప్రజాకలం ప్రతినిధి) : రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్ఐ మోతీరాం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో గురువారం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి నిర్లక్ష్య చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని అన్నారు. ప్రతి వాహనదారుడు తన భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువత, వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణను
# ఉపసంహరించుకోవాలి
### - మెట్‌పల్లిలో నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన




మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 23 (ప్రజాకలం) యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మెట్‌పల్లి డివిజన్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) మధుసూదన్ డిమాండ్ చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం మెట్‌పల్లి డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ మధుసూదన్ మాట్లాడుతూ, విద్యుత్ రంగం ప్రజలకు అత్యంత కీలకమైన సేవా రంగమని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రతతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యుత్ సంస్థలను లాభాపేక్షతో కాకుండా ప్రజా సేవా దృక్పథంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని, విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, సెక్రటరీ హరి ప్రసాద్, జేఏసీ నాయకులు లక్ష్మణ్ సురేష్, ఎండీ కరీం, శంకరయ్య, రవీందర్,భోయినపల్లి అశోక్, లక్ష్మీ, రాజమ్మ, మౌనిక తదితర విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు
### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
### - రంగాపూర్ సర్పంచ్ కు షోకాజ్ నోటీస్ జారీచేసిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి,జూలై 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వహించే సమయంలో ఆటంకాలు కల్పించడం,అసభ్యకరంగా ప్రవర్తించడం,బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గంట రమేష్ ప్రభుత్వ అధికారిని విధుల నిర్వహణలో అడ్డుకోవడం,అసభ్యకర,అనుచిత పదజాలంతో దూషించడం,బెదిరింపులకు పాల్పడినట్లు పెద్దపల్లి సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్,ఎం.బి.ఇంట్రా అందజేసిన ఫిర్యాదు మేరకు ప్రకారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఫిర్యాదును ప్రాథమికంగా పరిశీలించగా,అందులో పేర్కొన్న విధుల నిర్వహణలో సంబంధిత చట్టంలోని నిబంధనల పరిధిలోకి వస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో,సంబంధిత సర్పంచ్‌కు కారణం చెప్పాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.షోకాజ్ నోటీసు అందిన నుంచి ఏడు రోజులలోపు లిఖితపూర్వక సంజాయిషీ సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు.నిర్దేశించిన గడువులోగా సంజాయిషీ సమర్పించనట్లయితే,అందుబాటులో ఉన్న రికార్డులు,సాక్ష్యాధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తారని విధుల నిర్వహణకు ఆటంకం కల్పించడం,బెదిరించడం లేదా అనుచితంగా ప్రవర్తించడం చట్టరీత్యా తీవ్రమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు,అధికారులు పరస్పర గౌరవం,సమన్వయంతో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.



ప్రజా కలం
శుక్రవారం, జూలై 24, 2026

## విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనేది నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులకు అనుగుణంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల సంఖ్య, సరిహద్దులను మార్చడం. దీని ద్వారా అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలన్నీ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలోనే సీట్ల పెంపు హామీ ఇచ్చారు. డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే.. రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం.. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే.. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుకు ఉన్న ఏకైక రాజ్యాంగ అడ్డంకి పూర్తిగా తొలగిపోతుంది. మరి ఏపీ, తెలంగాణల్లో సీట్లు పెరుగుతాయనడానికి ఖచ్చితమైన గ్యారంటీ ఉందా అంటే.. సమాధానం నూటికి నూరు శాతం గ్యారంటీ అనే చెప్పాలి. ఎందుకంటే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక డీలిమిటేషన్ నమూనా 50 శాతం స్థానాల పెంపు ప్రాతిపదిక ప్రకారం లేదా ఏపీ విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం చూసినా సీట్ల సంఖ్య పెరగడం ఖాయం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు 26కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు పెరిగినప్పుడు, దానికి అనుగుణంగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాల విస్తరణ జరగడం తప్పనిసరి. ప్రస్తుతం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి కనీసం 225 లేదా అంతకంటే ఎక్కువకి , తెలంగాణ అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153 లేదా 160కి పైగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కావడం, అది ప్రకటన విడుదల చేయడం ద్వారా మాత్రమే కొత్త నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వుడు స్థానాల వర్గీకరణ ఖరారవుతాయి. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర అసెంబ్లీలు మళ్లీ తీర్మానాలు చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టమే రాష్ట్ర స్థానాల పెంపునకు నేరుగా వర్తిస్తుంది. ఈ సీట్ల పెంపు ప్రక్రియ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన రాజకీయ సంచలనాలకు, సమీకరణలకు దారితీయనుంది. ప్రతి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు, యువ నాయకులకు కొత్తగా ఎమ్మెల్యేగా పోటీ చేసే సువర్ణావకాశం లభిస్తుంది. అంతేకాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లోనూ, అమరావతి పరిసర ప్రాంతాల్లోనూ జనాభా ప్రాతిపదికన మరిన్ని కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో 175, తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయి. 2028 చివర్లో తెలంగాణ, 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరగవచ్చు. ఇది ప్రజలకు కొత్త సమస్యలు తెస్తుంది. జనాభా పెరిగిన ప్రాంతాల్లో ఒక ఎమ్మెల్యేకి ఎక్కువ ఓటర్లు, అసమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువ కాబట్టి వారి సమస్యలు సరిగా ప్రతిబింబించకపోవచ్చు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గినట్టు అనిపించవచ్చు. డీలిమిటేషన్ పార్లమెంట్‌కే పరిమితం కాదు, అది రాష్ట్రాల శాసనసభలను కూడా సమాంతరంగా పునర్వ్యవస్థీకరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చిన మరుక్షణమే డీలిమిటేషన్ కమిషన్ రంగంలోకి దిగుతుంది. అందువల్ల ఏపీ , తెలంగాణ అసెంబ్లీలలో స్థానాలు పెరగడం అనేది కేవలం ఒక రాజకీయ అంచనా మాత్రమే కాదు, రాజ్యాంగపరంగా, చట్టపరంగా జరగబోయే ఒక అనివార్యమైన పరిణామం!

# ప్రజలకు సత్వర న్యాయం

### - జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల ప్రతినిధి జులై 23 (ప్రజా కలం)

ప్రజలకు సత్వర న్యాయం అందేలా చూడాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. గురువారం నాడు వార్షిక తనిఖీల్లో భాగంగా జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించి, విచారణలో ఉన్న కేసులపై అధికారులతో చర్చించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు, నేరాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసింగ్ ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై చేపడుతున్న చర్యలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో వేగం, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత వైఖరి పాటించాలని అధికారులకు ఆదేశించారు. రిసెప్షన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు నమోదు చేసిన పిటిషన్ మేనేజ్‌మెంట్ వివరాలను పరిశీలించిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్‌మెంట్ ద్వారా రసీదు జారీ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ పరిశుభ్రత పాటించడంతో పాటు ఫైళ్లను క్రమబద్ధంగా భద్రపరచాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ శాఖలో అమలవుతున్న నూతన సాంకేతికతపై అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, సిబ్బందికి ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్కలు నాటి, పచ్చదనం, పరిశుభ్రత కోసం ప్రతి పోలీస్ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, మల్యాల సీఐ రాజ్‌కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పెగడపల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో

## కేటీఆర్ ముద్ర చిరస్మరణీయం

**- బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్**

**- ఘనంగా కేటీఆర్ 50వ ముందస్తు జన్మదిన వేడుకలు**

**- 24న నీట్ వ్యతిరేక ఉద్యమంపై ఇందిరా పార్క్ ధర్నాకు తరలి రండి**



పెద్దపల్లి,జూలై 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర సాధనలో,రాష్ట్ర భవిష్యత్తును టెక్నికల్ మరియు పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా నిలపడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చేసిన కృషి చిరస్మరణీయమని టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ కొనియాడారు. కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ముందస్తు వేడుకలను గులాబీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి స్వయంగా పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో పరిపూర్ణమైన జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల పక్షాన కేటీఆర్ కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ జులై 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నీట్ వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి నిరసనగా తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దపల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు,విద్యార్థి విభాగం మరియు యువత పెద్దఎత్తున తరలి వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఒకరోజు ముందే పెద్దపల్లిలో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమని, కేంద్రంలో నీట్ పేపర్ లీకేజీకి కారణమైన బీజేపీ,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల వద్ద దిష్టిబొమ్మలు దహనం చేయడం, నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రూప్-1ఇంటర్వ్యూలకు పిలిచిన 3,200 మందికి పైగా అభ్యర్థుల వివరాలు ఇప్పటివరకు వెల్లడించకపోవడం, అలాగే నీట్ పీజీ పరీక్షలో జీరో మార్కులు వచ్చిన వారికి కూడా వాలిడిటీ ఇస్తూ సీట్లు కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సుల్తానాబాద్ లో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోబిన్,మాజీ కౌన్సిలర్లు బిక్షపతి,స్వామి,ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి,పడాల సతీష్ గౌడ్,బింగి రాజు,మేడుదుల రాజ్ కుమార్,ఉప్పు శివ కుమార్,బోయిని మనోజ్,పెంచాల శ్రీకాంత్,శ్రీకాంత్,కంచి నాగరాజ్,దాసరి సతీష్,ఇరుగురాల స్వామి దాస్,సాయి,వెంకటేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవల్లో మరింత జవాబుదారీతనం రావాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,జూలై 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రభుత్వ శాఖల పనితీరు క్షేత్రస్థాయిలో మెరుగుపడి ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం పెద్దపల్లి,ధర్మారం,జూలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్ ఎంపీపీఎస్ పాఠశాల,ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయం, పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి ఎం.పీ.పీ.ఎస్,జడ్పీ.హెచ్.ఎస్, అంగన్‌వాడీ కేంద్రం,రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,రాగినేడు జడ్పీ.హెచ్.ఎస్,బొంపల్లి జడ్పీ.హెచ్.ఎస్ ప్రాథమిక పాఠశాల,ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే,జూలపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం,రాయడం,వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు బోధన అందించాలని, విద్యా ప్రమాణాల పెంపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులకు అందుతున్న ఆహారం,వసతి,పరిశుభ్రత,భద్రత,ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎదుగుదల,పోషకాహార పంపిణీని పరిశీలించిన కలెక్టర్ గర్భిణులు,బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు,పాలు తదితర ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి సాధ్యమైనంత ఎక్కువ వైద్య సేవలను స్థానికంగానే అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామంలోని జడ్పీ.హెచ్.ఎస్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు వివరాలు,ఉపాధ్యాయుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉదయం పాఠశాలలో అందిస్తున్న రాగి జావా నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్ రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా రైతులకు రీ సర్వే ప్రయోజనాలను వివరించి ప్రజల పూర్తి సహకారంతో ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. జూలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు,ఇతర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు జాప్యం లేకుండా పారదర్శకంగా,వేగవంతంగా సేవలు అందించడం ప్రతి అధికారికి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మండల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల ప్రతినిధి జూలై 23 (ప్రజాకలం) జగిత్యాల ధరూర్ ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించి, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని విద్యార్థులకు అనుకూలంగా ఉండే విధంగా కిచెన్ షెడ్ నిర్మాణ పనులు నాణ్యతతో, వేగవంతంగా నిర్మించాలని నిర్మాణం పనులలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. రాజ్ కుమార్, గుత్తే దారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జలసిరి సంబంధిత పనులపై అవగాహన

**- ఎంపీడీవో చిప్ప గణేష్**

ఇబ్రహీంపట్నం జూలై 23( ప్రజా కలం ప్రతినిధి)

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సమక్షంలో జలసిరి సంబంధించిన పనులకు సంబంధించి సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో ఐకెపి ఆధ్వర్యంలో పనిచేసే వివోఏలు మరియు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ సంబంధించిన అధికారులు పాల్గొనడం జరిగింది ప్రతి డిపార్ట్మెంట్ వారిగా ఫారం పాండ్స్. వ్యక్తిగత ఇంకుడు గుంతల సంబంధించిన పనుల పైన రివ్యూ చేయడం జరిగింది. ప్రతి డిపార్ట్మెంట్ పరంగా అగ్రికల్చర్ పరంగా ప్రతి గ్రామానికి 4 ఫారం పాంట్స్ ఐకెపి తరఫున ప్రతి వివోకు మూడు వ్యక్తిగత ఫారం పాంట్స్ నిర్మాణం చేపట్టడానికి లబ్ధిదారులను గుర్తించవలసినదిగా తెలియజేయడం జరిగింది. రేపటి లోగా టార్గెట్ పరంగా ప్రతి డిపార్ట్మెంట్ పరంగా గుర్తించి గ్రామపంచాయతీ తీర్మానాలతో సహా సమర్పించవలసినదిగా తెలియజేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో ఎంపీడీవో చిప్ప గణేష్. ఎంపీ ఓ. రాజు. ఏవో. ఏపీవో. ఏపీఎం. సంబంధిత డిపార్ట్మెంట్ వారి అధికారులు పాల్గొనడం జరిగింది.

## సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**- మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి**

**- డబ్బా వాటర్ గ్రిడ్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్**

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 23 (ప్రజా కలం) ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ (వాటర్ గ్రిడ్) కేంద్రాన్ని గురువారం మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ గ్రిడ్ ద్వారా సరఫరా అవుతున్న



తాగునీటి విధానాన్ని, నిల్వ ట్యాంకులను పరిశీలించారు. నీరు స్వల్పంగా రంగు మారి వస్తున్నట్లు గమనించిన చైర్మన్, తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటినే అందించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, ఫిల్టర్ బెడ్లు, పంప్ హౌస్‌లు, మోటార్లను నిరంతరం శుభ్రపరచాలని, నీటి శుద్ధి ప్రక్రియలో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్‌ను నిర్దేశిత మోతాదులోనే వినియోగించాలని అధికారులకు సూచించారు. నీటి రంగు, రుచి మారకుండా ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్షలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, 22వ వార్డు కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మున్సిపల్ డీఈ నాగేశ్వరరావు, మిషన్ భగీరథ విభాగానికి చెందిన డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతి వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ కుట్రలు

**బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ - ఎంపీ వంశీ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ రాజీవ్ రహదారిపై ధర్నా**



సుల్తానాబాద్,జూలై 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై నిరసన ధర్నా చేపట్టారు.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో సభలో గళం వినిపించాల్సింది పోయి,జాతి వ్యతిరేక శక్తులను వెంటేసుకుని యువతను తప్పుదోవ పట్టించేలా రాహుల్ గాంధీ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.నీట్ పరీక్షపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ,కాంగ్రెస్ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం యువతను బలిపశువులను చేస్తున్నారని ధ్వజమెత్తారు.జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన దీక్ష కేవలం నీట్ అవకతవకలపై కాదని,దేశాన్ని విభజించే కుట్రలో భాగంగా ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోరుతూ,హిందూ దేవతలను కించపరిచేలా సాగుతోందని విమర్శించారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకి కనీస అవగాహన లేకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేసుకోవడంతో సమానమని హెచ్చరించారు.తన సొంత నియోజకవర్గంలో అనుచరులను కాపాడుకోలేని చేతకానితనం వంశీది అని,కాంగ్రెస్ ఎమ్మెల్యేలు,తన తండ్రి మంత్రి వివేక్,వంశీ అనుచరులపై భౌతిక దాడులు చేపిస్తున్నప్పటికీ వారిని కాపాడుకోలేని వంశీ ప్రధానిని విమర్శించడం ఆయన పరిపక్వతలేమికి నిదర్శనమని,ఇంకోసారి ప్రధాని మోడీని విమర్శిస్తే పార్లమెంట్ పరిధిలో తిరగనివ్వమని తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు సొదరి మహేందర్ యాదవ్, జిల్లా కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్,మాజీ మండల అధ్యక్షుడు కొమ్ము తిరుపతి,బీజేపీ సీనియర్ నాయకులు మిట్టపల్లి ప్రవీణ్,ఎల్లెంకి రాజన్న,లంక శంకర్,ఏగొలపు సదయ్య గౌడ్,పాసేడ్ల రవీందర్,కొల్లూరి సంతోష్ కుమార్,కొమ్మిడి రాజేందర్ రెడ్డి,దొంగల శ్రీనివాస్ రెడ్డి,బండారి లత,మెండే శంకరయ్య,మల్క భాగ్యలక్ష్మి,ఎరవెల్లి అనిల్ రావు,ఎర్రం సంతోష్ రెడ్డి,వడ్లకొండ శశివర్ధన్,మేకల రాజయ్య,అమరగొండ గంగయ్య,వీరగోని కిరణ్ గౌడ్,కొత్తూరి సంపత్,గుర్రం రమేష్,చిట్టవేణి సదయ్య,శేఖర్ మాస్టర్,బుర్ర సతీష్,పొన్నం శ్రీనివాస్, కరెంగుల నవీన్,ఐలవేనా శ్రీనివాస్,దాసరి చందు,వలస సాయికిరణ్,నల్లవెల్లి బాలకృష్ణ,ఈర్ల ప్రశాంత్, మనుపటి బాలకృష్ణ,బూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**- ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత**

**- గ్రామసభల ద్వారా భూ రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి**




జగిత్యాల ప్రతినిధి జూలై 23 (ప్రజాకలం)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు.గురువారం కోరుట్ల పట్టణంలోని 165 పోలింగ్ స్టేషన్ పరిధిలోని 15వ వార్డులో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఫారాల పంపిణీ, వివరాల నమోదు, ఓటర్లకు అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేయాలని, వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ సర్వే-రీ సర్వే కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ మండలంలోని లక్ష్మీపూర్, సిర్పూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. నిబంధనలు, భూ రీ-సర్వే విధానం, సర్వే నిర్వహణ ప్రక్రియపై రైతులు, గ్రామస్థులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట

**- నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బ్లాక్ స్పాట్ల నివారణకు రూ.1,023 కోట్లు**

**- లోక్‌సభలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం**

జగిత్యాల ప్రతినిధి జులై 23 (ప్రజాకలం)

తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్ల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమగ్ర వివరాలు వెల్లడించినట్లు చెప్పారు.తెలంగాణలో గత కొన్నేళ్లలో మొత్తం 1,513 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 1,308 ప్రాంతాల్లో శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని, మిగిలిన 205 బ్లాక్ స్పాట్లలో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించినట్లు ఎంపీ అరవింద్ తెలిపారు.

**- నిజామాబాద్, జగిత్యాలకు ప్రత్యేక ప్రాధాన్యం**

నిజామాబాద్ జిల్లాలో గుర్తించిన 78 బ్లాక్ స్పాట్లలో 75 ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన 3 ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే జగిత్యాల జిల్లాలో గుర్తించిన 107 ప్రమాదకర బ్లాక్ స్పాట్లలో 99 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మిగిలిన 8 ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని కేంద్రం వెల్లడించిందన్నారు.

**- ఎన్‌హెచ్-63, ఎన్‌హెచ్-61, ఎన్‌హెచ్-44పై అభివృద్ధి పనులు**

నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలోని ఎన్‌హెచ్-63, ఎన్‌హెచ్-61, ఎన్‌హెచ్-44 జాతీయ రహదారులపై వంతెనలు, బైపాస్‌లు, రోడ్డు భద్రతా చర్యలతో కూడిన అభివృద్ధి పనులు వివిధ జాతీయ రహదారి అభివృద్ధి కార్యక్రమాల కింద ప్రణాళిక, అమలు దశల్లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని అర్వింద్ తెలిపారు. రూ.1,023 కోట్లతో రోడ్డు భద్రతా పనులు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రజలకు సురక్షితమైన రహదారులు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తామని చెప్పారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ, వంతెనలు, బైపాస్‌లు, ఇతర రోడ్డు భద్రతా మౌలిక వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1,023 కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా రోడ్డు భద్రతా పనులను మరింత వేగవంతం చేయడానికి కృషి కొనసాగుతుందని ఎంపీ వెల్లడించారు.

# ఆశా నోడల్ సూపర్వైజర్లకు కీలక ఆదేశాలు

**- మాతా-శిశు ఆరోగ్యం, టీకాలు, హెచ్‌బీఎన్‌సీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్‌పై సమీక్ష**

**- ఆన్‌లైన్ డేటా నమోదు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో ఆదేశం**

జూలై 23 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నాణ్యత పెంపుతో పాటు మాతా-శిశు ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఐ. ప్రకాష్ సూచించారు. గురువారం వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా నోడల్ సూపర్వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రతి ఉపకేంద్రంలో ఈడీడీ జాబితా, ఈడీడీ క్యాలెండర్‌ను క్రమం తప్పకుండా నిర్వహించి గర్భిణుల ప్రసవాలను నిరంతరం ట్రాక్ చేయాలని సూచించారు. ఎంసీహెచ్ పోర్టల్‌తో పాటు ఇతర ప్రభుత్వ పోర్టళ్లలో ప్రసవాలు, ఆరోగ్య సేవలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ కోసం ప్రత్యేక సమయం కేటాయించి పెండింగ్ నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు హెచ్‌బీఎన్‌సీ సందర్శనలను సకాలంలో పూర్తి చేసి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వెంటనే నమోదు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జాతీయ టీకాల షెడ్యూల్ ప్రకారం ప్రతి అర్హ చిన్నారికి పూర్తి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గర్భిణుల ప్రసవాల కోసం ముందస్తు రవాణా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.ప్రతి గర్భిణికి హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స అందించాలని, ఏఎన్‌సీ



రిజిస్టర్లు, గర్భిణుల ప్రొఫైళ్లు పూర్తిగా నిర్వహించి అవసరమైన నమూనాలను సకాలంలో పరీక్షలకు పంపించాలని ఆదేశించారు. ఎంసీపీ కార్డులు ప్రతి లబ్ధిదారుని వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఎన్‌సీడీ పోర్టల్‌లో వాస్తవ జనాభా నమోదుతో పాటు 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పూర్తి చేయాలని, స్క్రీనింగ్ లక్ష్యాలను 95 శాతానికి పైగా సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశా కార్యకర్తలు, నోడల్ సూపర్వైజర్లు కీలక పాత్ర పోషిస్తున్నందున సమన్వయంతో పనిచేసి అన్ని లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని డాక్టర్ ఐ. ప్రకాష్ పిలుపునిచ్చారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్. రాజమౌళి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సయ్యద్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ సజిదా బేగం, డాక్టర్ అరుణ్ కుమార్ జోషి, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్న, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, డీపీహెచ్ఎన్‌వో శ్రీమతి మనోజతో పాటు ఆశా నోడల్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పూర్తి చేయాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి - కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 23:

జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తప్పులు లేకుండా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్ఐఆర్ పురోగతి, గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లాలో జడ్చర్ల, దేవరకద్ర, మహబూబ్ నగర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎస్ఐఆర్ డిజిటైజేషన్ వేగంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 79.62 శాతం డిజిటైజేషన్ పూర్తికాగా, మొత్తం ఏనుమరేషన్ ఫారాల స్వీకరణ, పరిశీలన పురోగతి 86.55 శాతానికి చేరిందని వెల్లడించారు. ఎన్నికల సంఘం ఏనుమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడంతో ప్రజలకు ఫారాలు సమర్పించేందుకు అదనపు అవకాశం లభించిందన్నారు. ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లు, బి.ఎల్. ఓ లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. ఫీల్డ్ సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ అవసరమైన శాఖల సమన్వయంతో పనులు చేపడుతున్నామని చెప్పారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారని కలెక్టర్ తెలిపారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో 1,200 మందికి పైగా ఓటర్లు ఉంటే ప్రత్యామ్నాయ పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ.ఆర్.ఓ లకు సూచించినట్లు చెప్పారు. పోలింగ్ స్టేషన్ల స్థానాలు, ఒకే ప్రాంగణంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.జిల్లాలో ఓటర్ల మొబైల్ నంబర్ల నవీకరణ పూర్తయిందని, వీఐపీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సేకరించాలని ఈ.ఆర్.ఓలు, బి.ఎల్.ఒలకు సూచించినట్లు తెలిపారు.

ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారి ఫిర్యాదులను పరిశీలించి, ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారికి ఫారాలు అందజేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జాబితాలో పేరు లేని వారు ముసాయిదా ఓటరు జాబితా విడుదల అనంతరం ఫారం-6 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

మరణించిన ఓటర్ల వివరాలను కుటుంబ సభ్యుల ధృవీకరణతో నమోదు చేసి, సంబంధిత ఫారాల ఆధారంగా మాత్రమే తొలగింపు ప్రక్రియ చేపడుతున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. 85 సంవత్సరాలు దాటిన ఓటర్ల వివరాలను కూడా మరోసారి క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని బీఎల్‌వోలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన వారు మళ్లీ భౌతికంగా ఫారం ఇవ్వాల్సిన అవసరం లేదని, బి.ఎల్.ఓ లు కేవలం క్షేత్రస్థాయిలో వివరాలను




ధృవీకరిస్తారని చెప్పారు. డూప్లికేట్ నమోదులను గుర్తించే సౌకర్యాన్ని బి.ఎల్.ఓ లాగిన్‌లలో అందుబాటులోకి తీసుకువచ్చామని, పూర్తిస్థాయి విచారణ అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల పేర్ల తొలగింపు, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, ఒకే ఇంటి నంబర్‌పై అధిక సంఖ్యలో దరఖాస్తులు, డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, అనామలీల పరిష్కారం, కుటుంబ సభ్యులను ఒకే పోలింగ్ స్టేషన్‌లో కొనసాగించే విధానం, ఆగస్టు 3 తర్వాత చేపట్టే ప్రక్రియపై పలు సందేహాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లను నేరుగా తొలగించబోమని స్పష్టం చేశారు. సంబంధిత ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిన అనంతరం మాత్రమే మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన, గుర్తించలేని ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఎన్నికల జాబితాను ప్రక్షాళన చేయడమేనని, ఆగస్టు 3తో ప్రస్తుత ప్రక్రియ ముగిసిన తర్వాత ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, అనంతరం ప్రజలు, రాజకీయ పార్టీలు అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. అనుమానాస్పద నమోదులు, అసాధారణ దరఖాస్తులపై నోటీసులు జారీ చేసి ఆధారాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ బీఎల్ఏలకు సూచనలు చేసి, క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎన్నికల డి.టి. జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు రక్షించడం అందరి బాధ్యత : సర్పంచ్ వజ్రమ్మ



ప్రజా కలం జూలై 23 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం పరిధిలోని మాచర్ల గ్రామ సర్పంచ్ వజ్రమ్మ తిమ్మప్ప ఆధ్వర్యంలో మాచర్ల నుంచి ఎల్లం దొడ్డి రోడ్డు కు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో చెన్నయ్య హాజరై వారి చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని కోరారు. నేడు నాటే మొక్కలే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం, పచ్చదనాన్ని అందిస్తాయని అన్నారు. మొక్కలను పెంచడం బాధ్యతగా భావించి భావితరాలకు మంచి వాతావరణం నెలకొల్పాలని కోరారు. వృక్షాలే మన మంచి నేస్తాలు అని అభివర్ణిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కల పెంపకం వ్యర్థ కాలుష్య నివారణకు, వర్షాలు సమృద్ధిగా పడేందుకు దోహదపడతాయన్నారు. పండ్ల పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచాలన్నారు. ప్రతి మొక్క మనవాళికి మనుగడకు జీవనధారంఅని పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పి సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి, ముని నాయక్, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు బి లోకేష్, వీరేష్, రాము, సెక్ష, వెంకటేష్, చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన అదనపు కలెక్టర్లు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 23: ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి మంత్రి హోదా లభించిన సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు హరిప్రియ, మధుసూదన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడంలో అంకితభావంతో పనిచేస్తున్న శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి మంత్రి హోదా లభించడం మహబూబ్‌నగర్ జిల్లాకు గౌరవకారణమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో జిల్లా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నవీన్ , ఇతర అధికారులు పాల్గొని ఎమ్మెల్యే కి అభినందనలు తెలిపారు.

# మెల్ల చెరువు చౌరస్తా వద్ద మురుగునీరు నిల్వ..

## - ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజా కలం జూలై 23 (గద్వాల ప్రతినిధి)

గద్వాల పట్టణంలోని మెల్ల చెరువు చౌరస్తా నుంచి మెల్ల చెరువు,పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లే రహదారిపై మురుగునీరు నిల్వ ఉండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షపు నీటితో పాటు మురుగునీరు కూడా అక్కడే నిలిచిపోవడంతో రాకపోకలు దాదాపు అంతరాయం కలిగే పరిస్థితి ఏర్పడింది.ముఖ్యంగా పిల్లిగుండ్ల కాలనీకి చెందిన పాదచారులు,వృద్ధులు,మహిళలు,విద్యార్థులు పట్టణానికి వెళ్లి రావడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సైతం సురక్షితంగా నడిచే మార్గం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు మురుగునీటిలో జారి పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ పరిస్థితి ప్రమాదాలకు దారితీసే అవకాశం



ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి నిల్వ ఉన్న మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆకేరు వాగులో అక్రమ ఇసుక దందా

**- ధూప తండా పరిధిలో యథేచ్ఛగా తవ్వకాలు**

**- అధికారుల చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**



(వరంగల్/పర్వతగిరి) జూలై 23, ప్రజాకలం ప్రతినిధి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ధూప తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఆకేరు వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన కొందరు లీడర్ల ఆధీనంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు పర్యావరణానికి నష్టం కలుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా ఇసుక తరలింపులు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# మృతదేహానికి నివాళులర్పించి రూ.10 వేల ఆర్థిక సహాయం

**- ఆర్థిక చేయూత నందించిన సర్వోదయ సంస్థ ప్రతినిధులు**



జూలై 23 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట డివిజన్ కేంద్రానికి చెందిన ఆరెల్లి యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ టిజిసాక్స్ (టి జి యస్ ఎ సి యస్) ప్రతినిధులు ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యాకయ్య గతంలో సర్వోదయ సంస్థలో కమ్యూనిటీ మెంబర్‌గా పలు సంవత్సరాలు సేవలందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆయన కుటుంబం నిరుపేద పరిస్థితుల్లో ఉందని, భవిష్యత్తులో కూడా కుటుంబానికి సంస్థ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సంస్థ మేనేజర్ శాంతరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవమ్మ, యాకేందర్, రేణుక, రాజేందర్, ప్రవలిక, బాలాజీ, పద్మ, రమాదేవి, సబితా, రాజవర్ధన్, రాజ్‌కుమార్, సరోజన, లక్ష్మి, రషీదా, సంధ్య, విజయ్, విజయ, ప్రసాద్ తదితరులు పాల్గొని యాకయ్యకు నివాళులర్పించారు.

# జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నూతన జనరేటర్ ప్రారంభం



నిర్మల్, జులై 23(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన జనరేటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాథోడ్ రమేష్ గురువారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాల సమయంలో కూడా కలెక్టరేట్‌లోని కార్యాలయాల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నూతన జనరేటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, సిబ్బంది పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బొంద్రేట్ గ్రామంలో 'తెలంగాణ జలసిరి' అవగాహన సదస్సు..



తానూర్, జులై 23(ప్రజా కలం): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమంలో భాగంగా తానూర్ మండలంలోని బొంద్రేట్ గ్రామంలో గురువారం పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటలు మరియు బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ మార్కౌట్ వేసి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో శివలింగయ్య, గ్రామ సర్పంచ్ రవీందర్ పాటిల్ సిందే, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి రెడ్డి, టీఏ పోశెట్టి, ఐకేపీ వీవోఏ,సీఏ రాణి, గ్రామస్తులు మరియు రైతులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ యువతి పోలీసులకు ఫిర్యాదు

**- పెళ్లి చేస్తానని నమ్మించి శారీరకంగా దుర్వినియోగం చేశాడని ఆరోపణ**

**- అనంతరం పెళ్లికి నిరాకరించి చంపేస్తానంటూ బెదిరించాడని ఫిర్యాదు**

**- పర్వతగిరి పోలీసుల విచారణ ప్రారంభం**

(వరంగల్/పర్వతగిరి) జూలై 22, ప్రజాకలం ప్రతినిధి:

ప్రేమిస్తున్నానంటూ నమ్మించి, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి శారీరకంగా వాడుకొని చేసి, అనంతరం పెళ్లికి నిరాకరించడంతో పాటు చంపేస్తానంటూ బెదిరించాడని ఆరోపిస్తూ ఓ యువతి పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధితురాలు గుండా మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన గొడుగు వినయ్ గత ఏడాదిన్నర కాలంగా తనను ప్రేమిస్తున్నానని నమ్మించి, ఇద్దరం పెళ్లి చేసుకుందామని చెప్పాడని తెలిపింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు తనకు ఇతర సంబంధాలు చూస్తుండటంతో ఆ విషయం వినయ్‌కు చెప్పగా, తన కుటుంబ సభ్యులతో మాట్లాడి పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. అనంతరం జూలై 1న పెళ్లి విషయమై మాట్లాడుకుందామని చెప్పి స్నేహితుడి గదికి తీసుకెళ్లి, తన సమ్మతి లేకుండానే బలవంతంగా శారీరకంగా దుర్వినియోగం చేశాడని ఫిర్యాదులో ఆరోపించింది. తర్వాత తమ కుటుంబ సభ్యులు పెళ్లి విషయమై మాట్లాడేందుకు సిద్ధమైన సమయంలో వినయ్ బంధువులు తనపై అసత్య ప్రచారం చేసి అవమానించారని పేర్కొంది. అనంతరం వినయ్ పూర్తిగా మాట మార్చి, తాను ప్రేమించలేదని, కావాలనే శారీరకంగా కలిశానని చెప్పి పెళ్లికి నిరాకరించాడని ఆరోపించింది. అలాగే, పెళ్లి చేయకపోతే ఇంటి ముందు ధర్నా చేస్తానని



చెప్పగా, ఎంత డబ్బు కావాలంటే అంత ఇస్తానంటూ ప్రలోభపెట్టాడని ఫిర్యాదులో తెలిపింది. అంతేకాకుండా ఫోన్‌లో అసభ్య పదజాలంతో దూషిస్తూ, నిన్ను చంపడానికి కూడా వెనకాడను. నేను అధికార పార్టీ యూత్ నాయకుడిని. మా అమ్మ ఉపసర్పంచ్. నువ్వు నన్ను ఏమీ చేయలేవు అంటూ బెదిరించాడని బాధితురాలు ఆరోపించింది. ప్రేమ పేరుతో తనను మోసం చేసి, శారీరకంగా దుర్వినియోగం చేసి, అనంతరం పెళ్లికి నిరాకరించి బెదిరింపులకు పాల్పడిన వినయ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితురాలు పర్వతగిరి పోలీసులను కోరింది. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# 'జలసిరి' ఫామ్ పాండ్ లు భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేస్తాయి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ,జులై 23(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా, ఫామ్ పాండ్ నిర్మాణ శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో, ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి, అభినందించారు. వారి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ ల నిర్మాణాలు దోహదం చేస్తాయని వివరించారు. ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ ఉన్నాయని, ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంటకు నీరు అందుతుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించి గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారిపై కఠిన చర్యలు:జిల్లా ఎస్పీ

ప్రజా కలం జులై 23 (గద్వాల ప్రతినిధి)

జోగులాంబ గద్వాల్ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా జూలై 1 నుంచి చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్ర మం పురోగతిని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సమీక్షించారు. కార్యక్రమాన్ని మరింత సమ ర్థవంతంగా అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన 12వ ఆపరేషన్ ముస్కాన్ కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక పోలీసు బృందా లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ



బృందాలతో పాటు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖతదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గుర్తించిన బాలబాలికలను షెల్టర్ హోమ్‌లకు తరలిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని, 14 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిని కౌన్సెలింగ్‌కు పిలుస్తామని తెలిపారు. బాలల భవిష్యత్తు పరిరక్షణే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్-12 లో 2026 జూలై 22 నాటికి జిల్లాలో పురోగతి: మొత్తం రక్షించిన చిన్నారులు - 85 మంది (బాలురు 81, బాలికలు 4), రాష్ట్రానికి చెందిన పిల్లలు - 67 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు - 18 మంది, నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు - 24. ఈ గణాంకాలు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతూ గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్, డీసీఆర్‌బీ సీఐ టాటా బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సహదేవుడు, డీడబ్ల్యూఓ శాఖ అధికారి సునంద, డీసీపీఓ శాఖ నుంచి నరసింహనాయుడు, ఆర్డీఓ కార్యాలయం నుంచి డి.టి. విమోచన, డీఈఓ కార్యాలయం నుంచి జీసీడీఓ కర్రెప్ప, డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జి. రాజు, డీఎల్ఓ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ అబ్రహం, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 కోఆర్డినేటర్ శివలీల, ఆపరే షన్ ముస్కాన్ బృందం ఎస్సైలు ఆర్. శేఖర్, సురేష్, డీసీఆర్‌బీ ఎస్సై సుకూర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**- తీవ్రంగా ఖండించిన ఎమ్మార్పీఎస్ నందిగామ మండల ఇన్చార్జి చెన్నగళ్ళ అశోక్ మాదిగ**

( నందిగామ జులై 23 ప్రజా కలం ప్రతినిధి ) షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండలానికి చెందిన ఎంఆర్పిఎస్ నందిగామ మండల ఇన్చార్జి చెన్నగల్ల అశోక్ మాదిగ మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ముట్టడికి వేలాది సంఖ్యలో హాజరైన విద్యార్థులపై లాఠీచార్జి భాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. అనేక మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన అధికారులు,విద్యాశాఖ మంత్రిపై చర్యలు తీసుకోవడం మానేసి నిరసన చేస్తున్న విద్యార్థులపై అమానుషంగా కేంద్ర ప్రభుత్వం దాడులు చేయడం సరైనది కాదు అని ఆయన అభివర్ణించారు కేంద్రంలో గత 12 సంవత్సరాలుగా కొలువుతీరిన బిజెపి ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని ధ్వంసం చేసిందని ప్రశ్నించే శక్తులను దేశద్రోహులుగా అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తూ వారిపై సిబిఐ,ఈడీ, ఎన్ఐఎ,సంస్థలను ప్రయోగిస్తూ తప్పుడు కేసులు నమోదు చేసి జైలు పాలు చేసి నోరు మూయిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అనేకమంది విద్యార్థులను పోలీసులతో కొట్టించి చంపుతున్నారని అయన మండిపడ్డారు.



# భర్త వేధింపులతో మహిళ మృతి..

**భర్త, కుటుంబ సభ్యులపై కేసు**

**- గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి**

**- తండ్రి ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

జూలై 23 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్ జిల్లా చంద్రు తండాకు చెందిన భూక్య ప్రియాంక (33) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తతో పాటు కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 18 సంవత్సరాల క్రితం చంద్రు తండాకు చెందిన భూక్య రవి (40)తో ప్రియాంకకు వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వివాహానంతరం కొన్నేళ్లు దాంపత్య జీవితం సజావుగా సాగినా, గత ఎనిమిదేళ్ల క్రితం రవి మరో మహిళను వివాహం చేసుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అప్పటి నుంచి ప్రియాంకను ఇంట్లో ఉండొద్దంటూ వేధింపులకు గురిచేస్తూ తరచూ గొడవలకు దిగేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకోవడంతో గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు కూడా జరిగినట్లు సమాచారం. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియాంక గడ్డి మందు తాగింది. చికిత్స పొందుతూ జూలై 21న ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలి భర్త రవి, అతని కుటుంబ సభ్యుల వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందిందని, ఆమె మరణంపై అనుమానాలు ఉన్నాయని తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భాస్కర్ కుటుంబానికి అండగా ఎమ్మార్పీఎస్ నేతలు

**-రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్**



జూలై 23 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఇటీవల హత్యకు గురైన చిన్నపెల్లి భాస్కర్ కుటుంబాన్ని గురువారం ఎమ్మార్పీఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న నాయకులు తమ వంతు సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల నాయకులు కంచర్ల రవికుమార్, మరుపట్ల దేవదాస్, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బొక్కల నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్కూరి రమేష్, ఐనవోలు మండల ఇన్‌చార్జి బరిగెల ఏలియా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత పది రోజుల క్రితం మాదాపూర్‌లో చిన్నపెల్లి భాస్కర్‌ను కుల వివక్షతో కూడిన కక్షపూరిత దాడిలో తామరబోయిన రాజు యాదవ్‌తో పాటు అతని అనుచరులు సుపారీ తీసుకుని వేట కొడవళ్లతో అత్యంత దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. ఈ ఘటనను ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ హత్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి కుల వివక్షతో కూడిన దాడులు పునరావృతమైతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జలగం ఎల్లకుమార్, యాతర అనిల్, బర్ల యాదగిరి, బర్ల కొమురయ్య, మహమ్మద్ యాకూబ్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు ఇష్టం బాబు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం అస్తవ్యస్తం

**- ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు**



ప్రజా కలం జూలై 23 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం మాచర్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్నం భోజనం పథకం అమలు తీరు పూర్తిగా ధారణంగా మారింది. పాఠశాలలో వండుతున్న అన్నం ఏమాత్రం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు ఆ భోజనాన్ని తినలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన సన్న బియ్యం భోజనం అందించాల్సి ఉండగా, ఇక్కడ వండుతున్న అన్నం ముందుగా, సరిగా ఉడకకుండా ఉంటుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి లేని పరిస్థితుల్లో చాలామంది విద్యార్థులు ఆకలితో అలమట్టించలేక, ప్రతిరోజు తమ ఇళ్ల నుంచే భోజనం (క్యారియర్లు) తెచ్చుకుని తింటున్నారు.

సర్పంచ్ ఆకస్మిక తనికి... హెచ్చరిక:

పాఠశాలలో భోజనం సరిగా లేక విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారని విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వజ్రమ్మ గురువారం పాఠశాలను అకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్నం భోజన వంటశాలను, వండిన అన్నాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు, మెనూ ప్రకారం కోడిగుడ్లు వండించాల్సి ఉండగా... వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికి వదిలేశారని సర్పంచ్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకుంటూ విద్యార్థుల ఆరోగ్యాలతో ఆటలాడితే ఊరుకునేది లేదని వంట నిర్వాహకులను హెచ్చరించారు. వెంటనే అన్నం నాణ్యతను మెరుగుపరిచి, మెనూ ప్రకారం భోజనం వండించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు నివేదించి వంట ఏజెన్సీ లైసెన్సును రద్దు చేయిస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హిప్పెల్లి రేషన్ షాపులో ఈ-కేవైసీ ప్రక్రియ ప్రారంభం




తానూర్, జులై 23 (ప్రజా కలం): మండలంలోని హిప్పెల్లి గ్రామ రేషన్ దుకాణంలో కొత్తగా రేషన్ కార్డులు పొందినవారు, కార్డులలో పేర్లు చేర్చుకున్న లబ్ధిదారులకు ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతోందని సర్పంచ్ చంద్రే గంగా సాగర - శివరాం తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందాలంటే అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు, రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో స్థానిక రేషన్ డీలర్, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు

తానూర్, జూలై 23(ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్‌లోని శ్రీ విట్టలేశ్వర ఆలయంలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ మాస ఉత్సవాల నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఆలయ పరిసరాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు, ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పల్లకి ఊరేగింపునకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేశారు, ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటు పల్లకి ఊరేగింపు జరిగే ప్రధాన మార్గానికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యంతో పాటు భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు, ఆషాఢ మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు, పల్లకి ఊరేగింపు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.



## రఘుపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క..



తల్లాడ, జులై 23 (ప్రజా కలం న్యూస్): రఘుపతి రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. గురువారం ఖమ్మం జిల్లాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగులూరి లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్, దుండేటి వీరారెడ్డి, మాజీ జెడ్పిటిసి మూకర ప్రసాద్, దీవెల బాబు, మల్లవరం సర్పంచ్ కటిక కిరణ్ కుమార్, ఎస్టీ సెల్ నాయకులు అంజయ్య, కోసూర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పార్డి (బి) పాఠశాలలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి

నిర్మల్,జులై 23(ప్రజా కలం జిల్లా ప్రతిని): కుబీర్ మండలం పార్డి (బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీదర్శనం భోజన్న గురువారం సందర్శించారు, ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతంను ఆయన పరిశీలించారు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండటంతో




పాటు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తుండటంపై ప్రశంసలు కురిపించారు, అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల నమోదు, పెన్ నంబర్లు, అపార్ ఐడ జనరేషన్ తదితర అంశాలపై హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు, పాఠశాల నిర్వహణ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు, అనంతరం మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ నకిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి పార్డి (బి) ప్రాథమిక పాఠశాలను సందర్శించారు,అక్కడ నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్ట్ ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు, విద్యార్థులతో ప్రశ్నపత్రాన్ని చదివించి, ప్రశ్నలకు సమాధానాలు చెప్పించారు, విద్యార్థులు స్వయంగా, ఎంతో ధైర్యంగా సరైన సమాధానాలు చెప్పడాన్ని చూసి మెచ్చుకున్నారు. ముఖ్యంగా మూడో తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించేందుకు డీఈఓ గారు స్వయంగా బోర్డుపై సంయుక్త అక్షరాల పదాలతో కూడిన వాక్యాలను రాశారు,విద్యార్థులు ఎలాంటి తడబాటు లేకుండా ధారాళంగా చదవడంతో ఆయన ఎంతగానో ఆకట్టుకున్నారు. విద్యార్థుల చదువు నైపుణ్యాలపై ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు, తదుపరి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రీ-ప్రైమరీ విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల ప్రాథమిక పాఠశాలకు మంజూరైన కంప్యూటర్లను పరిశీలించి, వాటిని విద్యార్థుల అభ్యాసంలో సమర్థవంతంగా వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మొత్తంగా పార్డి (బి) ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత, విద్యార్థుల ప్రతిభ, ఎఫ్ఎల్ఎన్ అమలు మరియు డిజిటల్ వనరుల వినియోగంపై డీఈఓ భోజన్న పూర్తి సంతృప్తి వ్యక్తం చేసి, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

# విద్యార్థులకు అండగా మేమున్నాం

### విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

### షాద్ నగర్ పట్టణ కూడలిలో విద్యార్థుల ధర్నాకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు

షాద్నగర్ జులై 23 ప్రజా కలం ప్రతినిధి

షాద్ నగర్ పట్టణ కూడలిలో నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలు బలి అయ్యాయని, 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అయినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. విద్యార్థులకు అండగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే విద్యార్థులపై లాఠీలు విసరడమే కాకుండా, రాహుల్ గాంధీని కూడా గాయపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించేందుకు రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్న ప్రభుత్వం ముందుకు రావడంలేదని అని చెప్పారు. ఇప్పటిదాకా గాంధేయ మార్గంలోనే ఆందోళన చేశామని, ప్రభుత్వం దిగి రాకుంటే పార్లమెంటును ముట్టడించడానికి కూడా తాము సిద్ధమే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఒక అసమర్థ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉన్న ఏ దేశంలో ప్రజాస్వామ్య విరుద్ధంగా ఇలా ప్రభుత్వాన్ని కొనసాగించడం దారుణమని అన్నారు. అందుకే ప్రభుత్వంతో విసిగి వేసారిన విద్యార్థులు ఆందోళనకు దిగారని, వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ముందుకు నడుస్తుందని, వారికి సమాధానం దొరకేదాకా తాము బాసటగా ఉంటామని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద







ఆందోళన చేస్తున్న విద్యార్థులను లాఠీలతో కొట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

గత ప్రభుత్వాలలో తప్పులు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేశారని, కేవలం రైలు ప్రమాదం జరిగినందుకే నైతిక బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి లాంటివాళ్ళు రాజీనామాలు చేశారని గుర్తు చేశారు.

అలాంటిది విద్యార్థులకు ఇంత అన్యాయం జరుగుతున్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తే ప్రతిపక్షాలు చూస్తూ ఊరుకోమని, పోరాటమే మార్గంగా ముందుకు సాగుతామని ఆయన హెచ్చరించారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యెన్నం హెల్త్ కిట్ల పంపిణీ

### - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన వైద్యులు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 23:

మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి మంత్రి హోదా లభించిన సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎమ్మెల్యే కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ, ప్రజల ఆరోగ్యానికి మరింత ప్రాధాన్యత ఇచ్చి సేవలు కొనసాగించాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వైద్యుల సహకారంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నియోజకవర్గంలోని నవజాత శిశువుల తల్లులకు ‘ యెన్నం హెల్త్ కిట్లు ’ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసవం జరిగే ప్రతి తల్లికి యెన్నం హెల్త్ కిట్ అందజేయడమే కాకుండా, వారికి హెల్త్ కార్డులను కూడా అందిస్తున్నామని తెలిపారు. తల్లి-శిశు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రసవానంతర సంరక్షణలో తల్లులు మరియు శిశువులు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సామగ్రి ఈ హెల్త్ కిట్లలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్.డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ చైతన్య రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి రాజీనామా చేయాలి

### హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ - ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 23 :

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి మహేందర్ మరియ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై బాధిత విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ శాంతియుతంగా నిర్వహించిన ధర్నాపై జరిగిన చర్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మరియు యువతకు ఆదర్శంగా నిలిచిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పై దాడి చేసి అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. మహేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వేముల కృష్ణయ్య, జిల్లా మైనారిటీ సెల్ కన్వీనర్ షబ్బీర్ హుస్సేన్, జిల్లా నాయకులు టంకర కృష్ణయ్య,యాదిరెడ్డి,లింగం నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ చెన్నయ్య మాట్లాడుతూ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ గారిపై జరిగిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రధానమంత్రి వెంటనే తన తప్పును అంగీకరించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో:- హన్వాడ గ్రామ సర్పంచ్ ఇస్నాతి సుధాకర్,నయినోని పల్లి సర్పంచ్ నర్సిములు, తిరుమలగిరి సర్పంచ్ అనంత రెడ్డి,శంకర్ నాయక్, చందు నాయక్,దొర్రి తండా సర్పంచ్ శీను నాయక్,హత్యకుంట తాండ సర్పంచ్ లక్ష్మణ్,పాండు నాయక్,గ్రామ అధ్యక్షుడు వి.శ్రీనివాసులు ఉపసర్పంచ్ బైకని అంజమ్మ రాములు, బీసీ సెల్ అధ్యక్షులు తిరుపతయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బి రాములు మాజీ ఎంపిటిసి దాసరి ఆంజనేయులు, దాసరి వెంకటయ్య, బైకని వెంకటేష్, వార్డు నెంబర్ కృష్ణయ్య గౌడ్, కావలి శ్రీను, ఇస్నాతి నర్సింలు, నెత్తి చంద్రయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు,వివిధ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు...

## ఇరిగేషన్ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయబాబు ఆశీర్వాదం తీసుకున్న వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు..

తల్లాడ, జులై 23 (ప్రజా కలం న్యూస్): రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయబాబును టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. గురువారం హైదరాబాదులోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వైస్ చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా ఆయనకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకటేశ్వర్లు ఆయనకు పూలబుకి అందించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వైస్ చైర్మన్ గా నియామకం అయిన సందర్భంగా ఇరిగేషన్ చైర్మన్ విజయబాబు గారిని మర్యాదపూర్వకంగా కలిసి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినట్లు వెల్లడించారు.



## ముఖ్యమంత్రి పర్యటనలో ఎటపాక ముంపు బాధితులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి

### - కందుకూరి స్వర్ణ




ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, జూలై 23: ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించే సందర్భంగా ఎటపాక మండలంలోని ముంపు భూములు, గ్రామాలకు వచ్చే పుష్కరాల లోగా పూర్తి పరిహారం, పునరావాసం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కందుకూరి స్వర్ణ డిమాండ్ చేశారు. ఏడు మండలాల విభజనలో అత్యధికంగా నష్టపోయిన ఎటపాక మండలంలోని నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు పరిహారం అందలేదని ఆమె విమర్శించారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎటపాక మండలం ముంపు ప్రాంతంగా పరిగణించకపోతే తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఈ జిల్లా పర్యటనలో పరిహారం, పునరావాసంపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలవరం ప్రభావిత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య




పాలేరు జులై 23(ప్రజా కలం న్యూస్ )కూసుమంచి మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో 56% నోటు వర్షపాతం ఏర్పడిందని ,ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు మరియు వర్షాల ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా, తక్కువ కాలవ్యవధిలో పండే మరియు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సూచించిన పెసర, కంది , జొన్న, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా, వ్యవసాయ భూముల్లో ఫార్మ్ పాండ్లు (వ్యవసాయ నీటి కుంటలు) నిర్మించుకోవడం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని వివరించారు. భూగర్భ జలాల పెరుగుదలకు, నీటి సంరక్షణకు, పంటల స్థిర దిగుబడులకు ఫార్మ్ పాండ్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైదులు , మండల వ్యవసాయ అధికారి శ్రీమతి వాణి, వ్యవసాయ విస్తరణ అధికారి జానీ రైతులు, పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

### – జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



ప్రజాకలం జులై 23 (గద్వాల ప్రతినిధి) ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు,వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఐసీయూ,జనరల్ వార్డులు,ఇతర విభాగాలను పరిశీలించి రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు.ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని విధులకు హాజరు కాని వైద్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.అపరిశుభ్రంగా ఉన్న ఆసుపత్రి పరిసరాలను శుభ్రపరచడంతో పాటు వినియోగంలో లేని పరికరాలను స్క్రాప్‌గా విక్రయించాలని,పనిచేయని మానిటర్‌ను వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు.మరమ్మతులు,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రూ.50 లక్షలతో చేపట్టనున్న పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే ర్యాంపుపై పైకప్పు నిర్మాణం,రోగుల సహాయకుల కోసం షెడ్ ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం వైద్యాధికారులతో సమావేశమై అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించిన కలెక్టర్ పారిశుధ్య భద్రతా సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు.సదరం భవనం,రేడియాలజీ విభాగం,మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

## అన్నారుగూడెంలో ముమ్మరంగా కచ్చా డ్రైనేజ్ పనులు ప్రారంభం

### ప్రారంభించిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని

### సమస్య త్వరితగతిన పరిష్కారం జరగాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం

తల్లాడ జూలై 23 ప్రజా కలం న్యూస్ : వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో రోడ్ల వెంట వర్షపు నీరు నిలువ ఉండకుండా ఉండేందుకు తక్షణ చర్యగా కచ్చా డ్రైన్స్ పనులు ప్రారంభించామని సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు సంయుక్తంగా ఒక ప్రకటన చేశారు.ఈ వర్షాలకు నీటి నిల్వ ఉండటం చేత దోమల ఉనికి ఉధృతం అవుతుందని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని అందుకే తక్షణ కర్తవ్యంగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వారు తెలియజేశారు. సమస్యను పరిష్కరించే దానిలో త్వరితగతిన ప్రజలకు ఉపయోగం జరిగేలా ఉండేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.ఈ ఐదు సంవత్సరాలలో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని దానికోసం ప్రత్యేక కార్యచరణల ద్వారా ముందుకు వెళతామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కె.వెంకటేశ్వర్లు,స్థానిక వార్డు మెంబర్లు ఇస్నపల్లి ముత్తయ్య, గొడ్ల దేవిడ్,కొంగల బాబురావు, నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొమ్మగాని నాదం, మారెళ్ళ దేవేందర్, ఇస్నపల్లి పిచ్చయ్య, ఇస్నపల్లి శ్రీను,గొడ్ల మోసే,ప్రసాద్, నరసింహారావు తదితరులు ఉన్నారు.





## మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కెఎల్ఆర్ ని కలిసిన నూతన వివిధ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

మహేశ్వరం, జులై 23,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం ప్రశాంతి హిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏడు దొడ్ల సురేందర్ రెడ్డి, మీర్ పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్దాల శ్రీశైలం, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ పైలా శేఖర్ రెడ్డి,సీనియర్ నాయకులు పల్లె పాండుగౌడ్ , పరుశరామ్ సైదులు యాదవ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరెపల్లిలో 100 శాతం ఎస్ఐఆర్ పూర్తి చేసిన సిబ్బందికి సన్మానం.

దుబ్బాక ప్రజాకలం జూలై 23.

రాయపోల్ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతంగా పూర్తి చేయడంలో విశేష కృషి చేసిన బీఎల్వో ఇంద్రాల రేణుక, ఆశా వర్కర్ నవిత, జీపీవో ప్రభాకర్‌లను ఎంపీడీఓ సమక్షంలో వారికి ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ సకాలంలో దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకున్నారు. ఫారాలు నింపని వారికి గ్రామ పంచాయతీలో 15 రోజుల పాటు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దివ్య కృష్ణ, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ వీరేష్, గ్రామ కార్యదర్శి మౌనిక, ఏఈఓ శిరీష, వార్డు సభ్యులు కనకయ్య, కళ్యాణి, మమత, మంజుల, కొమురయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది.

### మండల విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి.

దుబ్బాక ప్రజాకలం జూలై 23.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రజ్ఞానంతో పాటు డిజిటల్ నైపుణ్యాలు పెంపొందించడం అవసరమని రాయపోల్ మండల విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి రూ. 1.50 లక్షల విలువైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను సైన్స్ ల్యాబ్‌కు అందించగా, ఎంఈఓ దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎఫ్‌పీ ద్వారా బోధన మరింత ప్రభావవంతంగా మారడంతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు విలువైన ఐఎఫ్‌పీ బోర్డును అందించిన ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గీతా ప్రవీణ్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, నర్సింలు గౌడ్, సంజీవ్, ప్రభాకర్, దివాకర్, రాజేంద్ర, అమరేందర్, కమలాకర్, ప్రసాద్, వసంత, పావని, సీఆర్‌పీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కర్బుజా కాయ మీద వారాహి చిత్రం వేసిన రామకోటి రామరాజు

గజ్వేల్:23 జులై 2026 (ప్రజా కలం ప్రతినిధి)



వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాళ్ళో భాగంగా కర్బుజా కాయ మీద అమ్మ అద్భుత రూపాన్ని చిత్రించి గురువారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి తనకున్న అపారమైన భక్తిని చాటుకున్నాడు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుష్ట శక్తులను తరిమికొట్టి అష్ట ఐశ్వర్యాలను, రక్షనను ప్రసాధించే పరాశక్తి వారాహి మాత అన్నారు. ఈ పవిత్ర దినాలలో అమ్మ వారిని భక్తితో ఆరాదించడం వల్ల సకల శుభాలు కలుగుతాయాన్నారు. గత 30 సంవత్సరాలనుండి ఎన్నో రకాల భగవంతుని చిత్రాలు భక్తితో చిత్రించి భక్తిని చాటుకున్నారు గజ్వేల్ లోని రామకోటి సంస్థ వారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని తెలిపారు.

## బీజేపీ మాజీ సర్వీస్‌మెన్ సెల్ జిల్లా కన్వీనర్ నీల చంద్రంకు ఘన సన్మానం.



దుబ్బాక ప్రజాకలం జూలై 23.

తెలంగాణ బీజేపీ మాజీ సర్వీస్‌మెన్ సెల్ సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా నియమితులైన రిటైర్డ్ ఆర్మీ జవాన్ నాయక్ నీల చంద్రంను బీజేపీ రాయపోల్ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. రాయపోల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంకిడి స్వామి నీల చంద్రంకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంకిడి స్వామి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సుదీర్ఘకాలం సేవలందించిన నీల చం ద్రంకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించడం సిద్దిపేట జిల్లాకు గర్వకారణమని అన్నారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమం కోసం నీల చంద్రం సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే పార్టీ బలోపేతానికి, మాజీ సైనికులను సంఘటితం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, మాజీ సైనికుల సంక్షేమానికి అంకితభావంతో సేవలందించాలని నాయకులు ఆకాంక్షించారు. అనంతరం నీల చంద్రంకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీల స్వామి, గజ్వేల్ రామచంద్రం, నర్సింలు, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కె ఎల్ ఆర్ ను కలిసిన నూతన పార్టీ అధ్యక్షులు

- సర్ లో కాంగ్రెస్ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలి
- క్షేత్రస్థాయిలో పని చేసిన వారికే పదవులు
- ఆశావాహులకూ రాష్ట్ర, జిల్లాలో బాధ్యతలు ఇస్తాం
- మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, జులై 23,(ప్రజా కలం)

పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం పని చేసే పార్టీ కేవలం కాంగ్రెస్సేనని మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇవాళ తుక్కుగూడ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల, డివిజన్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కె ఎల్ ఆర్ ను కలిశారు.

ఈ సందర్భంగా వారందరినీ సన్మానించిన లక్ష్మారెడ్డి విబేధాలు వీడి అందరినీ కలుపుకుని పోవాలని సూచించారు. ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమం వందశాతం పూర్తి అయ్యేలా బి ఎల్ ఏ , బిఎల్ఏ లను సమన్వయం చేసుకోవాలని నూతన అధ్యక్షులకు కిచ్చెన్న సూచనలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాలనీలు, డివిజన్లల్లోని ఓటర్ల, ముఖ్య నాయకులను కలుసుకుని... ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని డివిజన్ అధ్యక్షులకు కె ఎల్ ఆర్ విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 3వరకు ఎన్నికల సంగ్రామం తరహాలోనే సర్ ను పూర్తి చేయాలని బి ఎల్ ఏ లు, కాంగ్రెస్ శ్రేణులను లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ పై భగ్గుమన్న తెలంగాణ రక్షణ సేన విద్యార్థి లోకం

### ఓయూ, శాతవాహన విశ్వవిద్యాలయాల్లో నిరవధిక నిరాహార దీక్షలు




హైదరాబాద్, జూలై 23(ప్రజా కలం ప్రతినిధి)

ఢిల్లీలో చోటుచేసుకున్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా, పార్లమెంట్ ముట్టడికి యత్నించిన విద్యార్థుల పై పోలీసుల దమనకాండను ఖండిస్తూ తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం ఉద్యమించింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, కరీంనగర్ లోని శాతవాహన విశ్వ విద్యాలయంలో నాయకులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఆందోళన చేపట్టిన తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, పోలీసుల నిర్బంధాలు తమ పోరాటాన్ని ఆపలేవని స్పష్టం చేసిన విద్యార్థి నాయకులు,పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. అణచివేచేందుకు ప్రయత్నం చేస్తే దీక్ష ను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక నీట్ బాధితులకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేది లేదని విద్యార్థి నేతలు స్పష్టం చేశారు.

కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలోనూ తెలంగాణ రక్షణ సేన నాయకులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఢిల్లీలో విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా,శాతవాహన విశ్వవిద్యాలయాల్లో ఒకేసారి దీక్షలు ప్రారంభం కావడంతో క్యాంపస్‌లలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.






## ఓటరు జాబితాపై సింధు ఫోకస్..

### -ఓటు హక్కు రక్షణకు సింధు ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయి తనిఖీ..

ఘట్‌కేసర్,జులై 23 (ప్రజా కలం) ప్రతినిధి

భారతి నగర్ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి,ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్‌నగర్, మ్యాక్ సొసైటీ కాలనీలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సహాయ



కేంద్రాలను ఆమె సందర్శించి పరిశీలించారు. సహాయ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు,బూత్ స్థాయి ప్రతినిధులు ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరిస్తున్న తీరును పరిశీలించిన సింధు ఆదర్శ్ రెడ్డి,ప్రతి అర్హుడికి సరైన మార్గదర్శనం అందించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తులు పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ దరఖాస్తును పూర్తి చేసి సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాక్ సొసైటీ డైరెక్టర్లు నందగోపాల్,దుర్గారెడ్డి, రామారావు,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ,దేవేంద్ర చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జులై 23,(ప్రజా కలం)

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమం ఆగస్టు 3తో ముగుస్తున్నందున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్



ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఇవాళ ఉదయం సడన్ గా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో జరుగుతున్న సర్ ఎన్యూమరేషన్ ఫారమ్స్ ను పరిశీలించారు. వంద శాతం ఓటర్ల అప్ డేట్ ప్రక్రియ పూర్తి చేసేందుకు బి ఎల్ ఏ , బి ఎల్ ఓ లు కృషి చేయాలని కెఎల్ఆర్ తెలిపారు. స్వయంగా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్స్ అందయా?.. లేదా?.. పట్టణంలో ఉండేవారు ఎవరూ.?.. గ్రామంలో చనిపోయిన వారి వివరాలను తప్పుల తడకలు లేకుండా నింపాలని అధికార యంత్రాంగానికి, కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా నాగారం గ్రామస్తులు రోడ్డు, డ్రైనేజీ సమస్యను లక్ష్మారెడ్డి దృష్టికి తెచ్చారు. వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ఆర్ అండ్ బి , పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

## నీట్ పేపర్ లీక్ పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### -పి ఎల్ వై నగర కార్యదర్శి కొల్లూర్ భీమేష్

మహేశ్వరం, జులై 23,(ప్రజా కలం)

నీట్ పేపర్ లీక్ పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పి ఎల్ వై నగర కార్యదర్శి కొల్లూర్ భీమేష్ అన్నారు. ఎన్ టి ఏ ను రద్దు చేయాలి అని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర శాంతియుత నిరసన చేస్తున్న విద్యార్థి యువకులపై జరిగిన దాడిపై పారదర్శకంగా విచారణ జరపాలి. పోలీసులు అమానుష లాఠీ చార్జ్, టియర్ గ్యాస్, దాడిని ఖండిస్తూ గ్రేటర్ హైదరాబాద్ పి ఎల్ వై నగర కార్యదర్శి కొల్లూర్ భీమేష్ మాట్లాడుతూ రేపు జూలై 24న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ కు యువజన సంఘాల సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రకటించింది.





## రవీంద్రసూరికి సినారె సాహితీ పురస్కారం

కూకట్ పల్లి, జులై 23, ప్రజా కలం ప్రతినిధి:

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరికి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా సి నారాయణరెడ్డి (సినారె) స్మారక సాహితీ పురస్కారం ప్రకటించారు. మహాకవి సినారె 95వ జయంతిని పురస్కరించుకొని సినారె కళాపీఠం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసిన ఎంపిక కమిటీ సభ్యులకు, సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు గారికి రవీంద్రసూరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని తన వ్యక్తిగత విజయంగా కాకుండా సాహిత్యానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## కేఎల్ఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధనరాజ్ గౌడ్

మహేశ్వరం, జులై 23, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నల్లెంకి ధనరాజ్ గౌడ్ ని నియమించినందుకు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధనరాజ్ గౌడ్ డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో జలసిరి అవగాహన

### చిన్న, సన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో వివిధ నీటి సంరక్షణ

### మహేశ్వరం ఎంపీడీఓ శారదమ్మ

### డివిజనల్ పంచాయతీ అధికారి సామిరెడ్డి

మహేశ్వరం, జులై 23,(ప్రజా కలం)

మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో జలసిరి కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో వివిధ నీటి సంరక్షణ, నీటి



వనరుల అభివృద్ధి పనులను అందించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, రైతులకు సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం, భూగర్భ జలాల పెంపుదల, రైతులకు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శారదమ్మ, డివిజనల్ పంచాయతీ అధికారి సామిరెడ్డి ఏపిడి ఇబ్రహీంపట్నం, ఎంపీఓ రవీందర్ రెడ్డి,ఏఓ నాగమణి, సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, మండల సర్పంచులు, ఉప సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





## ఓటు హక్కే ఆయుధం..ఆగస్టు 3లోపు దరఖాస్తు

### -ఆగస్టు 3లోపు ఎస్ఐఆర్ పూర్తి చేయండి

### -ఓటు హక్కు కాపాడుకోండి: మహిపాల్ రెడ్డి..

పటాన్‌చెరు,జులై 23 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు ఆగస్టు 3లోపు దరఖాస్తు సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన 30 ప్రచార రథాలను గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రతి ఓటు కీలకమని,అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 3లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లు,మూడు మున్సిపాలిటీలు,రెండు మండలాల్లో ప్రచార రథాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## నేడు తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎన్ఎస్‌యూఐ పిలుపు



కూకట్ పల్లి, జూలై 23, ప్రజా కలం ప్రతినిధి: జాతీయ ప్రవేశ పరీక్షల్లో జరుగుతున్న వరుస అక్రమాలు, వ్యవస్థాగత వైఫల్యాలు మరియు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తెలంగాణ రాష్ట్ర విభాగం జూలై 24, 2026 (శుక్రవారం)న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది.

"విద్యను రక్షించండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, విద్యార్థుల హక్కులను పరిరక్షించండి" అనే ప్రధాన నినాదంతో ఈ బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది.

కొన్ని ప్రధాన డిమాండ్లు :

కేంద్ర మంత్రి రాజీనామా: జాతీయ పరీక్షల నిర్వహణలో వైఫల్యం మరియు కుంభకోణాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి.

చీూా రద్దు: విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూా) ని తక్షణమే రద్దు చేయాలి.

పోలీసుల దౌర్జన్యంపై చర్యలు: ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన ఘోరమైన లాఠీఛార్జీకి బాధ్యులైన వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్య హక్కులు: విద్యార్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను మరియు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షించాలి.

"విద్య అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు, అది కొందరికే పరిమితమైనది కాదు.

ప్రస్తుతం జరుగుతున్న చీూా కుంభకోణాలు, వ్యవస్థాగత అన్యాయం మరియు ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జ్ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై జరిగిన ప్రత్యక్ష దాడి. విద్యా పరిరక్షణకు, విద్యార్థుల హక్కుల సాధనకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు మరియు యువత ఏకమై పోరాడాలని ఎన్ఎస్‌యూఐ జేఎన్టీయూ ప్రెసిడెంట్ సన్నీ ఇమ్మానుయేల్ కోరారు.

## కార్మికులకు అండగా బిఎంఎస్ ఉంటుంది

### గజ్వేల్ బి ఎం ఎస్ ఇంచార్జ్ మరాఠీ కృష్ణమూర్తి




గజ్వేల్ :23 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

కార్మికులకు అండగా బిఎంఎస్ సంఘం ఉంటుందని గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ మరాఠీ కృష్ణమూర్తి అన్నారు. గజ్వేల్ కూరగాయల మార్కెట్ ముందు కూరగాయల మార్కెట్లో పనిచేసే కార్మికులతో కలిసి బిఎంఎస్ 72 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బి.ఎం.ఎస్ కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం గజ్వేల్ నియోజకవర్గం బిఎంఎస్ ఇన్చార్జి మరాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు ఎల్లవేళలా బిఎంఎస్ కార్మిక సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో పనిచేస్తున్న స్వీపర్లకు గత ఆరు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే జీతాలు ఇవ్వాలని అన్నారు. తొలి ఏకాదశి పండుగ పూట కూడా కార్మికులు పస్తులు ఉండాలనే ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పండగ కైనా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం నాయకులు డాక్టర్ నరేష్ బాబు, మనోహర్ యాదవ్, నాయిని సందీప్, అరవింద్,కూరగాయల మార్కెట్ వర్కర్స్ కమిటీ అధ్యక్షులు లక్ష్మి, ఉపాధ్యక్షులు యాదగిరి,జె లక్ష్మి,నుగుణ, లక్ష్మి,మంజుల,భాగ్య, పోచయ్య, బాలనర్సయ్య, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## నేటి బంద్‌కు పూర్తి స్థాయి మద్దతు ప్రకటించిన గజ్వేల్ మండలం విద్యార్థి విభాగం

గజ్వేల్:23 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

"ప్రతి జిల్లా... ఒక రోజు... ఒక డిమాండ్..." అనే శాంతియుత నినాదంతో నేడు నిర్వహించనున్న బంద్‌కు గజ్వేల్ మండలం విద్యార్థి విభాగం పూర్తి స్థాయి మద్దతు ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ విభాగం అధ్యక్షుడు పంగ మోహన్ బాబు వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్న అన్ని విద్యార్థి సంఘాలకు ఆయన సంఘీభావం ప్రకటిస్తూ అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యలపై విద్యార్థుల స్వరాన్ని బలంగా వినిపించే వేదికగా ఈ బంద్ నిలవాలని, దీనిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామంలో ప్రజలు, విద్యార్థులు, ప్రజాసంఘాలు ఈ బంద్‌కు సహకరించి,విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ వంతు మద్దతు అందించాలని ఆయన కోరారు.



## సర్ ప్రక్రియను పరిశీలించిన జీవీఆర్



కూకట్ పల్లి, జులై 23, ప్రజా కలం ప్రతినిధి: స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ (సర్) కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం 258 డివిజన్ ప్రశాంత్ నగర్ లో బిఎల్ఓ, బిఎల్ఏ లతో కలిసి ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించిన కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓటర్ల కు తగిన సూచనలు చేస్తూ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు పి నాగిరెడ్డి, ప్రశాంత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చందర్ రావు, కూకట్ పల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు మేకల రమేష్, అర్ వాసు, ఫాల్గుణ రావు, సుదర్శన్ మేకల, రమణ, బచ్చలి రవి, వలకొండ ప్రభాకర్, గెంటే నర్సింహా, రవికాంత్, శాఖ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో సీసీ రోడ్డు శంకుస్థాపన

### -బీరంగూడలో అభివృద్ధి బాటలు.. శశిధర్ రెడ్డి

### సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం..

పటాన్‌చేరు,జులై 23 (ప్రజా కలం) ప్రతిని

బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ముందడుగు పడింది. ప్రజల మౌలిక సదుపాయాల కోసం అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు



శశిధర్ రెడ్డి సొంత నిధులతో నల్లూరి హైట్స్ కాలనీలో 210 మీటర్ల సీసీ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేస్తానని, సమస్యల పరిష్కారం కోసం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. బీరంగూడ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు చుక్క రెడ్డి,నరేందర్ రెడ్డి, రామ్‌చంద్ర రెడ్డి, మురళి, వెంకట్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు..

## విద్యార్థులు స్కూల్ దశ నుండె నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి - రంగారావు

కూకట్ పల్లి, జులై 23, ప్రజా కలం ప్రతినిధి:

విద్యార్థులు స్కూల్ దశ నుండె నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మాజీ మాధవరం రంగారావు అన్నారు. గురువారం కూకట్ పల్లి శాంతినగర్ లో గల శ్రీ చైతన్య స్కూల్ లో క్యాబినెట్ ఎన్నికల ప్రక్రియను ప్రిన్సిపాల్ మీనలిని తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విధానాలపై అవగాహన కల్పించడం మరియు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడం ఈ ఎన్నికల ప్రధాన ఉద్దేశమని, ఎన్నికల ప్రక్రియను పాఠశాల యాజమాన్యం క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించిందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన విద్యార్థులు తమ సహ విద్యార్థులకు తమ ఆలోచనలు, ప్రణాళికలను వివరించగా, విద్యార్థులు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఓట్ల లెక్కింపు అనంతరం విజేతలుగా గెలుపొందిన విద్యార్థులు పాఠశాల అభివృద్ధి, క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమం వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మజ, రాజేష్, చారి, జాహ్నవి, భరత్, శాస్త్రిక మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# స్వీయ సంరక్షణే ఆరోగ్యానికి కవచం..

## 24 గంటలు, వారంలో 7 రోజులూ అప్రమత్తతే రక్షణ

నిజామాబాద్, జూలై 23 (ప్రజా కలం ప్రతినిధి): ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే అనారోగ్యం వచ్చిన తర్వాత చికిత్సకే పరిమితం కాకుండా, ముందుగానే స్వీయ సంరక్షణ అలవాటు చేసుకోవాలని 108 అత్యవసర అంబులెన్స్ సేవల సంస్థ సూచించింది. అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో తెలంగాణ 108 అంబులెన్స్ సేవల కార్యనిర్వాహణ అధికారి బి. సుధాకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతి ఏడాది జూలై 24న అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. రోజులో 24 గంటలు, వారంలో 7 రోజులూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ తేదీని ఎంపిక చేశారు.




**ఆందోళన కలిగిస్తున్న గుండెజబ్బులు**

108 అత్యవసర సేవల గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు తెలంగాణలో 17,940 ఛాతీ నొప్పి కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారిలో గుండె సంబంధిత సమస్యలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

లిరక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొవ్వు శాతం వంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను ముందుగానే గుర్తించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**ఐదు అలవాట్లు.. గుండెకు రక్షణ**

ప్రతి భోజనంలో ఒక పండు, ఒక కూరగాయ తప్పనిసరిగా తీసుకోవాలి.

రాత్రి భోజనం అనంతరం కనీసం అరగంట నడవాలి.

పొగాకు, మద్యానికి పూర్తిగా దూరంగా ఉండాలి.

మూడు నెలలకు ఒకసారి రక్తపోటు పరీక్ష చేయించుకోవాలి.

ప్రతిరోజూ నిద్రకు ముందు కొద్దిసేపు ధ్యానం చేయాలి.

**యువతలోనూ గుండెజబ్బుల ముప్పు**

దేశంలో గత ఏడు సంవత్సరాల్లో గుండెజబ్బుల బాధితుల సంఖ్య దాదాపు మూడు రెట్లు పెరిగినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 15 నుంచి 29 ఏళ్ల యువత కూడా గుండెజబ్బుల బారిన పడుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది.

**స్ట్రోక్ కేసులూ పెరుగుతున్నాయి**

గత ఆరు నెలల్లో తెలంగాణలో 5,025 మెదడు పక్షవాతానికి సంబంధించిన అత్యవసర కేసులు నమోదయ్యాయి. అధిక రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలు స్ట్రోక్‌కు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని అధికారులు తెలిపారు. జీవనశైలిలో మార్పులు, క్రమమైన ఆరోగ్య పరీక్షలతో ఈ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు.

**స్వీయ సంరక్షణతో అనేక ప్రయోజనాలు**

స్వీయ సంరక్షణ వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత పెరుగుతుంది. సమతుల్య ఆహారం, తగిన నిద్ర, వ్యాయామంతో రోగనిరోధక శక్తి మెరుగవుతుంది. పనితీరు, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయి.

**పాటించాల్సిన ఆరోగ్య అలవాట్లు**

పోషకాహారం తీసుకోవడం, రోజూ కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం. ధ్యానం, యోగా, పుస్తక పఠనం, సంగీతం వినడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపడం, అవసరమైనప్పుడు తన భావాలను పంచుకోవడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

అలాగే రోజులో కొంత సమయం మొబైల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండటం మెదడుకు విశ్రాంతినిస్తుంది.

**అత్యవసర వేళ వెంటనే స్పందించాలి**

అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా 108 అత్యవసర అంబులెన్స్ సేవలకు సమాచారం అందించి ప్రాణరక్షక సేవలను వెంటనే వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు సూచించారు. స్వీయ సంరక్షణ అంటే కేవలం ఆరోగ్యకరమైన అలవాట్లు మాత్రమే కాదు, అత్యవసర సమయంలో సరైన సేవలను సకాలంలో పొందడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

# విద్యా వ్యవస్థ నిర్వీర్యంపై విద్యార్థి లోకం తిరగబడాలి

**జూలై 24 తెలంగాణ రాష్ట్ర విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి**

**:తెలంగాణ రాష్ట్ర NSUI నాయకుడు గొల్ల జాన్**



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు వెన్నెముకైన విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి విద్యార్థి లోకం కదనరంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైందని ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల జాను పిలుపునిచ్చారు. దేశంలో విద్యా వ్యవస్థ రోజురోజుకూ నిర్వీర్యమవుతోంది. రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల భవిష్యత్తుతో వరుస పేపర్ లీకేజీల ద్వారా చెలగాటమాడడం అత్యంత బాధాకరమన్నారు. విద్యార్థుల ఆందోళనలకు సమాధానం ఇవ్వాల్సిన పాలకులు, ప్రశ్నించిన విద్యార్థులపై ఢిల్లీలో లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. విద్యారంగానికి తగిన ప్రాధాన్యత, నిధులు కల్పించకుండా విద్యార్థుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. విద్యార్థుల హక్కులను పరిరక్షించడం, విద్యా వ్యవస్థను కాపాడడం, విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం కోసం NSUI, SFI, AISF, PDSU, AIFDS, AISB, AIPSU, BGVS తదితర విద్యార్థి సంఘాల సంయుక్త పిలుపు మేరకు జూలై 24 (శుక్రవారం) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న "విద్యాసంస్థల బంద్" కు మేధావులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యను కాపాడుకుందాం... విద్యార్థుల భవిష్యత్తును రక్షిద్దాం... జూలై 24 తెలంగాణ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలను బెల్టు షాపు లాగా మార్చిన వైనం

**- రావిరాల ప్రభుత్వ పాఠశాలలో దర్శనమిస్తున్న బీర్ సీసాలు**
**- ప్రభుత్వ పాఠశాలను దేవాలయం లాగా పవిత్రంగా ఉంచుకుందాం**
**- ప్రభుత్వ పాఠశాలను బెల్ట్ షాప్ లాగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

మహేశ్వరం, జులై 23,(ప్రజా కలం)

ప్రభుత్వ పాఠశాలను బెల్టు షాపు లాగా మార్చిన వైనం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గం తుక్కుగూడ రావిరాల గ్రామం ప్రభుత్వ పాఠశాలలో బెల్టు షాపు లాగా బీరు సీసాలు దర్శనమిస్తున్నాయి ప్రభుత్వ పాఠశాలను దేవాలయం లాగా పవిత్రంగా ఉంచుకోవాల్సిన పాఠశాలను కొందరు కావాలని ఈ విధంగా చేస్తున్నారా అని విమర్శలు వస్తున్నాయి బీరు సీసాలతో రోజు తాగుతూ సీసాలు ఎక్కడపడితే అక్కడ పడేస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారిందని ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని విద్యార్థులు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇక్కడే మనం చదువుకున్నాం చదువులమ్మ తల్లి సరస్వతి దేవిని అవమానించే విధంగా దేవాలయం లాగా పవిత్రంగా ఉండాల్సిన పాఠశాలను అపవిత్రంగా చేయడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఇలా చేస్తున్నారు వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రావిరాల గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉత్తమ విద్యార్థులతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న పాఠశాలను అపవిత్రంగా చేసి పరువు తీస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాల వరండాలో మందు సీసాలు, చెత్త కనిపించడం అందరిని ఆందోళన గురిచేశాయి విద్యాదేవి ఉన్న చోట ఇలాంటివి సిగ్గుచేటు అని అన్నారు. బాధ్యత గల పౌరులుగా మనమంతా కలిసి పాఠశాలను శుభ్రంగా ఉంచుదాం వచ్చే తరం కోసం మన స్కూల్ పరువు కోసం ఇలాంటివి మళ్లీ జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు పోలీసు సిబ్బంది దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.


SADVALA. KARAN




# విద్యార్థులపై లాఠీచార్జీ అమానుషం

**- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**

**- పీడీఎస్‌యూ డిమాండ్**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 23:

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తీవ్రంగా ఖండించింది. విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలో జరుగుతున్న శాంతియుత ఉద్యమాన్ని అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, వారి గొంతు వినకుండా నిరసనలను అణిచివేసే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, పరీక్షల నిర్వహణలో భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల నిర్బంధ చర్యలను వెంటనే నిలిపివేయాలని, వారి ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నేడు విద్యాసంస్థల బంద్విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా శుక్రవారం (రేపు) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, యువత, మరియు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చి జయప్రదం చేయాలని దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు వైష్ణవి, శివాని, వచ్చేల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ అంశంపై బీజేపీని బద్నామ్ చేసే ప్రయత్నం:

**మెదక్ జిల్లా బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు పట్లోళ్ళ మల్లిక అశోక్.**

మెదక్, జూలై 23 (ప్రజా కలం ప్రతినిధి):

నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ కాంగ్రెస్ పార్టీ భారతీయ జనతా పార్టీని బద్నావ్ చేయాలని ప్రయత్నిస్తోందని మెదక్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లిక అశోక్ ఆరోపించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సీరియస్‌గా స్పందించి సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశాన్ని రాజకీయాలకు వాడుకోవడం బాధ్యతారాహిత్యమని ఆమె విమర్శించారు. వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి రాకముందే బీజేపీపై నిరాధార ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్



సింగ్ హయాంలో కూడా పలుమార్లు ప్రశ్నపత్రాల లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరిన ఆమె, ప్రధానమంత్రి నివాసం ఎదుట ధర్నాలు నిర్వహించడం, ప్రజలను రెచ్చగొట్టే విధంగా రాజకీయాలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

# మోర్తాడ్ మండల కేంద్రంలో టీయూఎఫ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 23:

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద గురువారం టీయూఎఫ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసలైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల ఆశయాల సాధన కోసం మరియు ఉద్యమకారుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో "శీనన్న నాయకత్వం వర్ధిల్లాలి", "తెలంగాణ ఉద్యమకారుల ఐక్యత వర్ధిల్లాలి" మరియు "జై తెలంగాణ" అంటూ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ మోర్తాడ్ మండల అధ్యక్షులు వై. నరసయ్య, ఉపాధ్యక్షులు ఎం. గంగాధర్, ప్రధాన కార్యదర్శి డి. బాబురావు, సలహాదారులు ఎం. రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ కి మద్దతు గా సంగారెడ్డిలో మూడో రోజు నిరసన ర్యాలీ.

**-జగ్గారెడ్డి నిర్మల ఆధ్వర్యం లో**
**సంగారెడ్డి లో 1000 మందితో మహా పాదయాత్ర**
**- రాహుల్ గాంధీ కి మద్దతుగా నల్ల టీ షర్ట్స్ ధరించి క్లాసిక్ గార్డెన్స్ నుండి గంజి మైదాన్ వరకు పాదయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**
**- ప్లకార్డులు, నినాదాలతో హోరెత్తిన సంగారెడ్డి**
**- రాహుల్ గాంధీ కి మద్దతుగా గత మూడు రోజులనుండీ సంగారెడ్డి లో కొనసాగుతున్న ఆందోళనలు**

సంగారెడ్డి ప్రతినిధి జులై 23( ప్రజా కలం):

నీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ... రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా గురువారం సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలను నిర్బంధించి... పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు. రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా... నల్ల టీ షర్టు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. ప్లకార్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్తలు నిరసన ను హోరెత్తించారు.





## బాచుపల్లి, క్రాంతినగర్ కాలనీలో రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

బాచుపల్లి డివిజన్ పరిధి క్రాంతినగర్ కాలనీలో సీఎంసీ నిధులతో మంజూరైన రూ.2 కోట్ల విలువైన రోడ్లు, పార్క్ అభివృద్ధి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మాజీ కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జీవన్ రెడ్డి, మురళి, నర్సింగరావు, కాలనీ సభ్యులు బుగ్గ రెడ్డి, రాజసుర, నవీన్, వంశీ, శ్రీధర్, హరి, కృష్ణ, రఘు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై కుత్బుల్లాపూర్ జోన్ ఇంజనీరింగ్ శాఖా

### ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమీక్ష సమావేశం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.



ఈసందర్భంగా పేట్ బషీరాబాదు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం, విద్యుత్ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈసమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుంది

### : మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 291 షాపూర్ నగర్ డివిజన్‌లో రూ.18 లక్షల వ్యయంతో చేపట్టనున్న షాపూర్ మార్కెట్ నుంచి పోస్ట్ ఆఫీస్ రోడ్డు వరకు నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధులను కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. షాపూర్ నగర్ ప్రాంత ప్రజలకు ఈసీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, స్థానికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిల్ల శ్రీనివాస్, చౌడ శ్రీనివాస్, కూన రాఘవేందర్ గౌడ్, బిల్లాశ్యామ్, శంకర్ రెడ్డి, సంపత్ గౌడ్, మల్లారెడ్డి, ఎమీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ఆఖరి బిల్లులు ఎప్పుడొస్తాయ్..?

## - లబ్ధిదారుల నిరీక్షణకు మోక్షం కలిగేనా...!

### - అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేసిన కుటుంబాలపై పెరుగుతున్న ఆర్థికభారం

### - వెంటనే బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు

**బొమ్మలరామారం, జూలై 23: (ప్రజా కలం)**

సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే ఆశతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసిన లబ్ధిదారులు ప్రస్తుతం ఫైనల్ (ఆఖరి) బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. బొమ్మలరామారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తయి అన్ని అర్హతలు సాధించినప్పటికీ చివరి విడత బిల్లులు విడుదల కాకపోవడంతో వందలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఇళ్ల నిర్మాణం కోసం బ్యాంకు లో బంగారం కుదువ పెట్టి, బంధు మిత్రుల వద్ద అప్పులు చేసి పనులు పూర్తి చేసిన లబ్ధిదారులు ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఫైనల్ బిల్లు విడుదల చేస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు అప్పుదారులకు రేపు,మాపు ఇస్తామని సమాధానపరుస్తు న్నామని, కానీ జాప్యం కారణంగా కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకలు, సిమెంట్, ఇనుము,ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి సరఫరా చేసిన వ్యాపారులు




బకాయిల కోసం రోజూ ఒత్తిడి చేస్తున్నారని లబ్ధి దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ఫైనల్ బిల్లులు ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై సంబంధిత శాఖల నుంచి స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. బిల్లుల విడుదలకు ఖచ్చిత మైన గడువు ప్రకటించి పెండింగ్ చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ బిల్లులు వెంటనే విడు దలయ్యేలా చర్యలు తీసుకోవా లని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పేదల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేకనిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ఇల్లు కట్టుకోవాలన్న మా కల నెరవేరింది. కానీ ఫైనల్ బిల్లు రాక అప్పుల భారంతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాం. ప్రభుత్వం వెంట నే పెండింగ్ బిల్లులు విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి" అని పలువురు లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

**మండల హౌసింగ్ ఏఈ వివరణ**

మండలంలో మొత్తం 430 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు వీటిలో 212 ఇండ్లు పూర్తి చేయడం జరిగింది వీటికి ఆఖరి బిల్లులు 1,60,000 వేల రూపాయల చొప్పున 212 ఇండ్లకు రావాలని తెలిపారు మిగతా 110 ఇండ్లు స్లాబ్ దశలో ఉన్నాయని, 22 ఇండ్లు గోడలు దశలో ఉన్నాయని, 37 ఇండ్లు బేస్మెంట్ దశలో ఉన్నాయని మిగతా మంజూరైన ఇండ్లు వివిధ గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులు ప్రారంభించలేదు అని హౌసింగ్ ఏఈ తెలిపారు

# తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ

## - నాయకుని తండాలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు -

## - తండా వాసులతో కలిసి నృత్యం చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం, జూలై 23 (ప్రజా కలం)

తండాల అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు,విద్యుత్,ఉపాధి వంటి అన్ని రంగాల్లో గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా,బొమ్మలరామారం మండలం,నాయకుని తండాలో గురువారం రోజున బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సర్పంచ్ ధీరవత్ రవీందర్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా మహిళలు, యువతులు సంప్రదాయ బంజారా వస్త్రధారణలో తీజ్ పండుగ ప్రత్యేక నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తండా ప్రజలతో కలిసి సంప్రదాయ నృత్యంలో పాల్గొని సందడి చేశారు. ఆయన తండా వాసులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేయడం అక్కడి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానికులు



ఆనందోత్సాహాలతో ఆయనకు ఘన స్వాగతం పలికి, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ,తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు.ప్రకృతిని ఆరాధిస్తూ, కుటుంబ సౌభాగ్యం, సుఖశాంతి,మంచి వర్షాలు, సమృద్ధి పంటల కోసం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవడం విశిష్ట సంప్రదాయమని పేర్కొన్నారు..

తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,వారి ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించే దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.తండాల అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు,విద్యుత్, ఉపాధి వంటి అన్ని రంగాల్లో గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.

తీజ్ పండుగ సందర్భంగా నాయకుని తండా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చీర సత్యనారాయణ,భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వైస్ రాజేష్ పైలెట్, పిఎసిఎస్ చైర్మన్ సింగిర్తి మల్లేష్, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ, ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మైలారం సుదర్శన్, యువజన విభాగం అధ్యక్షులు రామిడి శ్రావణ్ ప్రసాద్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తిరుమల కవిత వెంకటేష్ గౌడ్, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రామిడి రామిరెడ్డి, శ్రీరాములు నాయక్, రామిడి జంగారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పకీరు సంగీత, పిఎసిఎస్ డైరెక్టర్ సుర్వి బిక్షపతి గౌడ్, గంగాదేవి హనుమంతు, వట్టిపల్లి సుదర్శన్,వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, తండా పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నాభావు సాఠే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

## -సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు 57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి వినతి..



హైదరాబాద్:23 జూలై ( ప్రజా కలం ప్రతినిధి)

సాహిత్య సామ్రాట్, లోక్ షాహిర్, తొలి దళిత సాహితీవేత్త అన్నాభావు సాఠే జయంతిని ప్రతి ఏడాది ఆగస్టు 1న తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని 57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేయగా, ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు బైరి వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా మాంగ్ సమాజ్ జేఏసీ నాయకులు ఉద్ధవ్ కాంబ్లే, నర్సింగ్ మోరే, నాందేవ్, బాలాజీ, పరమేష్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ, 1920 ఆగస్టు 1న మహారాష్ట్రలోని వాటేగావ్‌లో మాంగ్ (మాతంగ్) సమాజంలో జన్మించిన అన్నాభావు సాఠే పేదరికం,కుల వివక్ష,సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ స్వయంకృషితో గొప్ప రచయితగా, ప్రజా కళాకారుడిగా ఎదిగారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఆయన రచనలు, ఉద్యమం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణలో మాంగ్,మాతంగ్‌తో పాటు 57 ఎంబీసీ అణగారిన వర్గాల ప్రజలు నివసిస్తున్నందున వారి సామాజిక, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించే దిశగా అన్నాభావు సాఠే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఆయన సేవలు ఒక వర్గానికే కాకుండా సమాజంలోని అన్ని పీడిత వర్గాలకు స్ఫూర్తిగా నిలిచాయని, జయంతిని అధికారికంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం పట్ల తన నిబద్ధతను చాటుకుంటుందని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ--57 ఎంబీసీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఉపదేశ్ సనధన్ మాంగ్ గారోడి,రాయిల లక్ష్మీనర్సయ్య చిందు,పోతుల మల్లేష్,బాలరాజు మదాసి కురువ,పర్శ శ్యాంరావు,బొబ్బిలి రమేష్ మాల జంగం,కర్నె రామారావు దక్కలి,చిన్నస్వామి మాష్టి, మాటపతి నాగయ్య స్వామి బేడ (బుడ్గ) జంగం, బత్తుల పాండు,విష్ణు పంబాల,బైండ్ల దేవేందర్, కొండ్లెపు అర్జున్ మోచి,శాఖమూరి యాదగిరి హోలియా దాసరి,దొంబర దివాకర్,మల్లు ప్రసాద్‌రావు మాలదాసరి,బ్యాగరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

- ముక్తకంఠంతో ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు
- బోడుప్పల్ సర్కిల్‌లో శాంతియుత నిరసన ర్యాలీ
- అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం..
- డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్..

మేడిపల్లి జూలై 23(ప్రజాకలం న్యూస్)

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులు, వేధింపులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.
అగ్రనేత రాహుల్ గాంధీ,ఇతర కాంగ్రెస్ నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బోడుప్పల్ కమాన్ నుంచి మేడిపల్లి వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులపై జరుగుతున్న అక్రమ అరెస్టులు, రాజకీయ వేధింపులను తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ఈ నిరసన ర్యాలీలో బోడుప్పల్, చెంగిచెర్ల, మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి,బండి




శ్రీరాములు గౌడ్, తుంగతుర్తి రవి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి,బోడుప్పల్ మాజీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,కొత్త కిషోర్ గౌడ్,ప్రభాకర్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ ఏనుగు జలంధర్ రెడ్డి,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మకు అజయ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కంటోన్మెంట్‌లో ప్రభుత్వ భూములనే కాపాడామన్న అధికారులు

- సామాజిక మాధ్యమాల్లో వస్తున్నవి తప్పుడు ప్రచారాలు-హైడ్రా
- లే అవుట్ అనుమతులు సర్వే నంబర్ల మార్పు పై రెవెన్యూ అధికారుల విచారణ

హైదరాబాద్, జూలై 23(ప్రజా కలం ప్రతినిధి)

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తీసుకున్న చర్యల పై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని హైడ్రా తీవ్రంగా ఖండించింది. జీఎల్ఆర్ నంబరు 243, 255లలోని 148 ఎకరాల ప్రభుత్వ భూమిని మాత్రమే కాపాడామని, ఇందులో ఎలాంటి ప్రైవేటు పట్టాలు లేవని స్పష్టం చేసింది. లోతుకుంటలోని శాంతాశ్రీరాం



బిల్డర్స్‌కు చెందిన భూమికి, హైడ్రా చర్యలు చేపట్టిన ప్రభుత్వ భూమికి దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఉందని, కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన ఎక్కడా జరగలేదని వివరించింది. అనుమతులు లేకుండా కొండలను పేల్చుతూ అక్రమ మైనింగ్‌కు పాల్పడటం,వన్య ప్రాణులకు హాని కలిగించడం, భూమి అన్యాక్రాంతమవుతోందని స్థానికులు, పర్యావరణ వేత్తల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకే ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తద్వారా రూ.10,000 కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రజల ఆస్తిని కాపాడామని వెల్లడించింది. లే అవుట్ అనుమతుల్లో సర్వే నంబర్ల మార్పు పై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నారని, నిజానిజాలు త్వరలోనే బయటపడతాయని హైడ్రా పేర్కొంది.

# సీఎం రేవంత్ వ్యాఖ్యల పై ఎమ్మెల్సీ ఎల్. రమణ ఆగ్రహం

- ఎస్ఐఆర్ పై ఆయన తీరు గందరగోళం
- గడువు పొడగించడానికి బీఆర్ఎస్ కారణం
- డబుల్ ఓట్లు తొలగించాలని డిమాండ్




హైదరాబాద్, జూలై 23(ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రములో శెరవేగంగా సాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించిన తీరు ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓటర్ల జాబితాలో నిజమైన ఓటర్లు మాత్రమే ఉండాలని, డబుల్ ఓట్లను పూర్తిగా తొలగించాలన్నదే బీఆర్ఎస్ అభిప్రాయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ సజావుగా జరగడంలో బీఆర్ఎస్ పార్టీ బి.ఎల్.ఎలు అత్యంత నిబద్ధతతో పనిచేస్తున్నారని,ఎస్.ఐ.ఆర్ గడువు పొడిగింపునకు బీఆర్ఎస్ నేతల చేసిన ఒత్తిడే కారణమని స్పష్టం చేశారు.పాలనపై ఎలాంటి పట్టు లేని సీఎం రేవంత్ రెడ్డి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై ఎన్నడూ సమీక్ష నిర్వహించలేదని ఏద్దేవ చేశారు. పైగా విధుల్లో ఉన్న బి.ఎల్.ఓలను, ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడటం బాధ్యతా రాహిత్యమని మండిపడ్డారు. కొడంగల్‌లోనే 60 వేల అనుమానాస్పద ఓట్లను ఎన్నికల కమిషన్ గుర్తించిందంటే అక్కడ ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థమవుతోందన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ వర్కర్లు,ఆయాల జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి,ఇప్పుడు వారి పనితీరును తప్పుపట్టడం సరైంది కాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లీగల్ నోటీసులు

### గ్లోబేరినా అంశంలో అసత్య ఆరోపణలు చేశారంటూ ఆగ్రహం
### 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, జూలై 23(ప్రజా కలం ప్రతినిధి)

గ్లోబేరినా టెక్నాలజీస్ అంశంలో తన పై నిరాధారమైన, అసత్య ఆరోపణలు చేశారంటూ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు జారీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే సీఎం హోదాలో ఉండి మీడియా ముఖంగా తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గ్లోబేరినా సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు,యాజమాన్య హక్కులు లేవని స్పష్టం చేశారు.ఆ సంస్థను తన బినామీ కంపెనీ అని వ్యాఖ్యానించడం,దానికి సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు.కేవలం రాజకీయ లబ్ధి కోసమే,తన ప్రతిష్టను దిగజార్చే దురుద్దేశంతోనే సీఎం ఈ ఆరోపణలు చేశారని పేర్కొన్నారు.మీడియా ద్వారా చేసిన ఈ తప్పుడు ఆరోపణల పై 48 గంటల్లోగా సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ



చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.ఒకవేళ నిర్దేశిత గడువులోగా క్షమాపణ చెప్పకపోతే రేవంత్ రెడ్డిపై సివిల్, క్రిమినల్ చర్యలతో పాటు పరువు నష్టం దావా వేస్తామని నోటీసుల్లో స్పష్టం చేశారు.

## గిర్మాపూర్ లో మద్యపాన నిషేధానికి
# గ్రామసభ తీర్మానం

### మద్యం విక్రయిస్తే రూ.5 లక్షల జరిమానా..
### పోలీస్, ఎక్సైజ్ అధికారులకు తీర్మాన పత్రం అందజేత..



గజ్వేల్ నియోజకవర్గం:23 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ జ్ఞానేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో మహిళలు,యువత, గ్రామ పెద్దలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయించినట్లు గుర్తిస్తే వారికి రూ.5 లక్షల జరిమానా విధించాలని గ్రామసభ నిర్ణయించింది. ఈ మేరకు రూపొందించిన తీర్మాన పత్రాన్ని గౌరారం ఎస్ఐతో పాటు సంబంధిత ఎక్సైజ్ అధికారులకు గ్రామస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,చిన్న వయసులోనే యువత మద్యానికి బానిసవుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాలల సమీపంలో మద్యం విక్రయాలు జరుగుతుండటంతో విద్యార్థులు కూడా చెడు అలవాట్లకు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. మద్యానికి అలవాటు పడిన కొందరు విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోయి పాఠశాలలకు వెళ్లడం మానేస్తున్నారని, మద్యం కోసం డబ్బులు సమకూర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అదేవిధంగా,మద్యానికి బానిసైన కొందరు యువకులు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తూ ప్రతిరోజూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవలు,దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బును కూడా దొంగిలించి మద్యం కోసం ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. యువత మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి విద్య,ఉపాధిపై దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి,యువత భవిష్యత్తు,కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ తీర్మానం తీసుకున్నట్లు తెలిపారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com